Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.09.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 16 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## సరిహద్దుల్లో... యుద్ధమేఘాలు

12లో



- స్విస్ ఛాలెంజ్‌కు సవాళ్లు
- గ్రీన్ ట్రిబ్యూనల్ నుండి ప్రశ్నలు
- రియల్ వ్యాపారానికి బ్రేకులు
- ప్రభుత్వానికి వరుస షాక్‌లు

# రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు ఎర్రజెండా!

***అమరావతి రాజధాని విషయంలో రాజధాని ఎక్స్‌ప్రెస్ అంత వేగంతో ముందుకు పోవాలను కున్నాడు చంద్రబాబునాయుడు. ఆచరణలోకొచ్చేసరికి మాత్రం అది ప్యాసింజర్ బండిలాగా కూడా కదలడం లేదు. రాజధాని పేరుతోనే మూడేళ్లు గడిచిపోతున్నాయి. ఆయన సీఎం అయ్యాక ఎక్కువ సమయాన్ని కేటాయించింది రాజధాని అంశానికే! అమరావతి రాజధానిని సింగపూర్‌లా కట్టాలా? సిడ్నీలా కట్టాలా? లేక వాషింగ్టన్ లానా? బీజింగ్ లానా? లేకుంటే మిలాన్ లాగానా? ఇస్తాంబుల్ తరహాలోనా? ఇవేమీ కాకుండా అన్ని నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసిన తర్వాత వచ్చే సిటీలాగానా? ఈ ఆలోచనలకే ఒక సంవత్సర కాలం సరిపోయి ఉంటుంది!***

ఇక భూ సమీకరణ ఘట్టం చాలావరకు ప్రశాంతంగానే జరిగింది. రాజధాని పరిసరాలలో రైతులకు రెండెకరాలు, మూడెకరాలు తప్ప పెద్దపెద్ద కమతాలు లేకపోవడం, రాజధాని వస్తే రైతులకు ఇస్తున్న ప్లాట్లు, హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ ప్రాంతంలోని ప్లాట్లతో పోటీ పడేలా ధరలు పెరుగుతాయని ఆశ కల్పించడం, అదీగాక ఈ ప్రాంతంలో ఒక సామాజికవర్గం వారు ఎక్కువుగా వుండి చంద్రబాబు రాజధాని కలకు సహకరించడం వల్ల దాదాపు 33వేల ఎకరాల భూ సమీకరణ చాలా సులభంగా జరిగిపోయింది. ఇక్కడ భూ సేకరణలో ప్రభుత్వానికి పెద్దగా ప్రతికూలత రాలేదు. అదే గనుక భూములు ఇచ్చేది లేదని రైతులు అడ్డం తిరిగి వుంటే, అమరావతి రాజధాని బదులు ఇంకో పేరు ప్రచారంలోకి వచ్చేది. అయితే రైతు అనే దేవుడు వరమిచ్చినా, పరిస్థితులు అనే పూజారి మాత్రం చంద్రబాబును కరుణించడం లేదు. (మిగతా 11వ పేజీలో)




# డబుల్ గేమ్

## అటు టీడీపీతో... ఇటు వైసీపీతో...

**2014 ఎన్నికల్లో బీజేపీకి బంపర్ మెజార్టీ వచ్చింది. ఆ పార్టీ ఒక్కదానికే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగినన్ని మెజార్టీ మార్క్ సీట్లు వచ్చినా మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. సొంతంగా మెజార్టీ ఉండడంతో ప్రభుత్వంపై మిత్రపక్షాల బెదిరింపులు, ఒత్తిళ్లు కూడా లేవు. చంద్రబాబు లాంటి వాళ్లకు కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం లేకుండాపోయింది.**

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎంత బాగా పనిచేసినా ఈసారి మాత్రం అన్ని సీట్లు రావు. మిత్రపక్షాలను కలుపుకోక తప్పదు. ఇప్పుడు ఎన్డీఏ కూటమిలో బలమైన ప్రాంతీయ పార్టీలుగా ఉండేది తెలుగుదేశం, శిరోమణి అకాలీదళ్, శివసేన వంటి పార్టీలే! 2019 ఎన్నికల్లో మరికొన్ని బలమైన ప్రాంతీయ పార్టీలను ఈ కూటమిలో చేర్చుకోక తప్పదు. (మిగతా 11వ పేజీలో)

## ఉత్తరక్రియలు



శ్రీమతి ఆలూరు పంకజాక్షమ్మ గారు
W/O స్వర్గీయ ఆలూరు వెంకటసుబ్బారెడ్డి(తాతగారు)

మంచి మనసున్న అమృతమూర్తి, మా తల్లి గారైన
శ్రీమతి ఆలూరు పంకజాక్షమ్మ గారు
తేది 15-09-2016 గురువారం నాడు స్వర్గస్తులైనారు.
ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు
ఆలూరు శ్రీనివాసులురెడ్డి - (లేట్) సుజాతమ్మ
ఆలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన
ఆలూరు రఘునాధరెడ్డి - అనూరాధ

కుమార్తె - అల్లుడు
పద్మజ - గుండాల భాస్కర్‌రెడ్డి

మనుమలు - మనుమరాళ్లు
ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ
డా|| ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి - రూప
డా|| సుష్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి(USA)
ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి
డా|| సహజ - డా|| శ్రీధర్‌రెడ్డి
డా|| సాహిత్య - ప్రశాంత్
గుండాల వినయ్‌రెడ్డి - చైతన్య(USA)
గుండాల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి - శ్రావ్య

మరియు ముని మనుమలు, ముని మనుమరాళ్ళు

ఉత్తరక్రియలు : తేది 29-09-2016 గురువారం, కోవూరు పాటూరురోడ్డులోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# పోర్ట్ కోసం వంటేరు పోరాటం

రామాయపట్నం పోర్ట్ సాధన కోసం వైఎస్సార్సీపి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి ఈనెల 24న పాదయాత్ర చేపట్టనున్నారు. ఆ మేరకు పాదయాత్ర పోస్టర్‌ను ఈనెల 18న జడ్పీటీసి శివలీల ఆవిష్కరించారు. ఈ నెల 24వతేదీ ఉదయం 8గంటలకు కావలిలోని కలుగోళ శాంభవి దేవస్థానంలో పూజలు నిర్వహించిన అనంతరం వంటేరు వేణు గోపాలరెడ్డి పాదయాత్ర ప్రారంభిస్తారని, రామాయపట్నం వరకు పాదయాత్ర చేస్తారని, ఈ పాదయాత్రలో కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని వైఎస్సార్సీపి నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ పాదయాత్రలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## కాలధర్మం

### అల్లారెడ్డి కృష్ణారెడ్డి



ఆత్మకూరు మాజీ మండలాధ్యక్షుడు, ప్రజలలో మంచి పేరున్న నాయకుడు అల్లారెడ్డి కృష్ణారెడ్డి ఈ నెల 7వ తేదీన అనారోగ్యంతో స్వర్గస్థులైనారు. ఆయన వయసు 72సంవత్సరాలు. ఆయనకు నలుగురు కుమారులున్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు మండల వ్యవస్థను ప్రవేశపెట్టాక 1987లో జరిగిన మండల ఎన్నికల్లో ఆత్మకూరు మండలం నుండి అధ్యక్షుడిగా గెలిచిన తొలి వ్యక్తి కృష్ణారెడ్డి. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీటీసీగా గెలిచారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా తన సేవలందించారు. 21వ తేదీ ఆత్మకూరులో నిర్వహించిన ఆయన ఉత్తరక్రియలలో ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బి.రాఘవేంద్రరెడ్డి, మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి, ఇంకా పలవురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### ఆలూరు పంకజాక్షమ్మ



కోవూరు ప్రాంతంలో అందరూ తాతయ్య అని అభిమానంగా పిలుచుకునే స్వర్గీయ ఆలూరు వెంకటసుబ్బారెడ్డి సతీమణి, ప్రముఖ వ్యాపారవేత్త ఆలూరు శ్రీనివాసులురెడ్డి మాతృమూర్తి ఆలూరు పంకజాక్షమ్మ ఈ నెల 15వ తేదీన దైవసాన్నిధ్యం పొందారు. ఆమె వయసు 85సంవత్సరాలు. వెంకట సుబ్బారెడ్డి పాటూరు రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి గుడి వ్యవస్థాపకులుగా ఆ దేవస్థానం అభివృద్ధికి చేసిన కృషిలో పంకజాక్షమ్మ కూడా భాగస్వాములయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కేర్ డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలూరు స్వరూప్‌రెడ్డి ఆమె మనుమడే! పంకజాక్షమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### పి.వి.సుబ్బారెడ్డి



పాదెర్ల వెంకటసుబ్బారెడ్డి తన 83వ యేట సెప్టెంబర్ 12వ తేదీ సోమవారం పరమపదం చారు. నెల్లూరుజిల్లా కోవూరుకు చెందిన సుబ్బారెడ్డి బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగింది. మద్రాసులోని లయోలా కాలేజీలో బి.ఎ.బి.యల్ పూర్తి చేసి మైకా ఎగుమతి వ్యాపారస్తుడిగా నెల్లూరులో స్థిరపడిపోయాడు. లక్ష్మీపురం సుబ్బారెడ్డిగా అందరికీ సుపరిచితుడైనా, గత కొద్ది సంవత్సరాలుగా నెల్లూరులోని మాగుంట లే అవుట్‌లో నివసిస్తున్నాడు. నెల్లూరులోని స్వామిదాస్ స్కూలుకి పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా 4దశాబ్దాలకు పైగా ఆయన కొనసాగాడు. వాలంటరీ బ్లడ్ డోనార్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సైతం తన సేవలు పలు సంవత్సరాలు అందించడమే కాకుండా రక్తదాతగా కూడా ఆయన ప్రసిద్ధి. వెంకటసుబ్బారెడ్డికి భార్య వెంకటశేషమ్మ, కుమారుడు జితేంద్రరెడ్డి వున్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### నక్కల రమణయ్య



కావలి మాజీ శాసనసభ్యులు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు మామ నక్కల రమణయ్య ఈ నెల 9వ తేదీన అనారోగ్యంతో కన్నుమూసారు. ఆయన వయసు 85 సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె మంజులను బీద మస్తాన్‌రావు వివాహమాడారు. ప్రకాశం జిల్లాలోని చేవూరు స్వగ్రామమైనప్పటికీ కొన్ని దశాబ్దాల క్రితం కావలికి వచ్చి స్థిరపడ్డారు. సౌమ్యుడిగా, మృదుస్వభావిగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పోటెత్తిన జనంతో.. పోలేరమ్మ జాతర



## - అమ్మవారి నామస్మరణలతో మార్మోగిన వెంకటగిరి



అమ్మా తల్లీ.. పోలేరమ్మా!.. కరుణించమ్మా!.. బిడ్డాపాపల్ని చల్లంగ చూడమ్మా!.. చల్లనితల్లీ మమ్ము దీవించమ్మా!.. అంటూ అశేష భక్తజనులు పెద్ద పెట్టున చేసిన విన్నపాలతో.. పోలేరమ్మ అమ్మవారి నామస్మరణలతో, ఘటాల ఊరేగింపులతో, తప్పెట్ల మోతతో వెంకటగిరి హోరెత్తిపోయింది. ఎక్కడ చూసినా జనప్రవాహమే. భక్తులపాలిట కల్పవల్లి.. అందరినీ చల్లగ కాపాడే తల్లి అయిన పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వెంకటగిరి ప్రజలే కాక, జిల్లా నుంచి..దూర సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆపదల నుంచి రక్షించే ఆ చల్లనితల్లికి, పాడిపంటలను కాపాడే ఆ కల్పవల్లికి భక్తులు పెద్దఎత్తున బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. టిటిడి ధర్మప్రచార పరిషత్ సభ్యులు పి.రాజ్‌కుమార్ తదితరులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సమర్పించేందుకు సారె తీసుకువచ్చి, ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారదలకు అందజేశారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన పుష్పాలను పోలేరమ్మ అమ్మవారికి అలంకరించారు. మంత్రి నారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి నుంచే అమ్మవారి పుట్టినిల్లయిన కుమ్మరింటిలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. భారీ ఊరేగింపు నిర్వహించి, అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. గురువారం ప్రధానమైన జాతర సందర్భంగా వెంకటగిరి ప్రాంతమంతా భక్తజన సంద్రంగా మారిపోయింది. అమ్మవారిని దర్శించుకుంటే ఈ ఏడాదంతా శుభప్రదంగా వుంటుందని, ఆ తల్లి చల్లని దీవెనలుంటాయనే విశ్వాసంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ రెండు రోజుల్లో భక్తులు సుమారు పది లక్షలకు పైగానే కొబ్బరికాయలను అమ్మవారికి సమర్పించుకుని మొక్కులు తీర్చుకుని వుంటారని ఒక అంచనా. ఎంతోమంది భక్తులు పిల్లాపాపలతో, కుటుంబాలతో సహా వచ్చి ఆ చల్లని తల్లిని దర్శించుకుని తరించారు. వెంకటగిరి రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ కుమార యాచేంద్రతో పాటు జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసులు ఈ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరను పర్యవేక్షించారు.

సింహపురి సమాచారం

# అక్కినేని సంస్మరణతో ప్రతిఏటా ప్రతిభా అవార్డు

## - ప్రముఖ సినీకవి వెన్నెలకంటి



ఎస్.వి.రామారావును అవార్డుతో సత్కరిస్తున్న వెన్నెలకంటి, హజరత్‌బాబు తదితరులు

నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకుంటూ, ఆయన జయంతి రోజున తనతండ్రి దివంగత వెన్నెలకంటి కోటేశ్వరరావు పేరుతో ప్రతిభా పురస్కారాన్ని అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో విజేత ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీహీరో డా.అక్కినేని నాగేశ్వరరావు 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెలకంటి మాట్లాడుతూ, అక్కినేనిని సంస్మరించుకుంటూ, ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతిఏడాది తన తండ్రి దివంగత కోటేశ్వరరావు పేరుతో ప్రతిభా అవార్డును అందిస్తామన్నారు. సింహపురి నుంచి సినీరంగానికి వెళ్ళిన మొట్టమొదటి వ్యక్తి వెన్నెలకంటి కోటేశ్వరరావుగారేనని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారుడు, సినీ విజ్ఞాన విశారద బిరుదాంకితుడైన ఎస్వీ రామారావుకు ప్రతిభా అవార్డును ప్రదానం చేశారు. ఇదే సందర్భంలో ప్రముఖ గాయకుడు పాటూరు శ్రీనివాసులుకు ఆత్మీయసత్కారం నిర్వహించారు. అనంతరం అక్కినేని జైత్రయాత్ర, నూరేళ్ళ సినిమా వైభవం లఘుచిత్ర ప్రదర్శన జరిగింది. బెంగుళూరుకు చెందిన ప్రముఖ నటులు, గాయకులు దర్శి లక్ష్మీ వెంకటేశ్వర వరప్రసాదరావు మాట్లాడుతూ, నెల్లూరుతో అక్కినేనికి వున్న అనుబంధాన్ని వివరించారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, విజేత ఆర్ట్స్ కార్యదర్శి శేషగిరీశం, విఆర్‌సి ఫిజిక్స్ రీడర్ డా. ఎం.సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# నైతిక విలువలతోనే మంచి సమాజం



విద్యార్థి దశ నుండే నైతిక విలువలు అలవర్చుకుంటే మంచి వ్యక్తులు, మంచి సమాజం, మంచి దేశం ఏర్పడుతుందని డాక్టర్ సి.వి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేటలోని ఎన్‌బివిఎస్ కళ్యాణ మండపం నందు సరస్వతి శిశు మందిరం ఆధ్వర్యంలో మానవ నైతిక విలువలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న డాక్టర్ సి.వి.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు నైతిక విలువలు, సత్ప్రవర్తన, క్రమశిక్షణ వంటివాటి గురించి వివరించారు. ఈ సదస్సులో డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని మాజీఅధ్యక్షులు కోట రమేష్‌బాబు, ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డ్ గ్రహీత రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు గాదంశెట్టి శ్రీకాంత్‌లు కూడా పాల్గొని నైతిక విలువలతోనే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ సదస్సులో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, వక్తలను సత్కరించారు.

# పరిశ్రమలకు త్వరగా అనుమతులు

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్**



పరిశ్రమలకు సంబంధించిన అనుమతులను నిర్దేశిత సమయంలోగా మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్ ఆదేశించారు. 21వ తేదీన నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఆయన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటి సమావేశం నిర్వహించారు. 48పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై ఆయన సమీక్షించారు. ఎస్‌పిపిసిఎల్ క్రింద పెండింగ్‌లో వున్న కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి పరిధిలో పెండింగ్‌లో వున్న 35 దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆ శాఖ వారికి సూచించారు.

ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వొమ్మిన సుబ్రహ్మణ్యం, డిఐసి జనరల్ మేనేజర్, వై.ఎల్.ప్రదీప్‌కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నాగేశ్వరరావు, ఎపిఎస్‌పిడిసిఎల్ తరపున శ్రీమతి రమాదేవి, ఫ్యాక్టరీస్‌కు సంబంధించి సురేష్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారి ప్రమోద్‌కుమార్, ఇండస్ట్రీస్ ఎ.డి. ఎస్.వి.సురేష్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకటరావు, టౌన్ అండ్ కంట్రోల్ ప్లానింగ్ అధికారి దొర్రె, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి గఫూర్, ఎఫ్ఎపిఎస్ఐఎ మెంబర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా మణిహారాలకు సత్కారం

ఇటీవల వియత్నాం రాజధాని హునాయ్‌లో జరిగిన 6వ ఏషియన్ యోగా పోటీలలో మూడు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించిన ఏకాంబరం జ్యోత్స్నను ఈ నెల 17వ తేదీన నెల్లూరులోని ఏసి స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో శాప్ సభ్యులు యం.రవీంద్రబాబు, డిఎస్‌డిఓ పి.వి.రమణయ్యలు సత్కరించారు. అలాగే జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇంటర్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకం సాధించిన కె.తులసిని కూడా సత్కరించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడలలో నెల్లూరుజిల్లా కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేసారని, ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే పి.వి.సింధులా ఒలింపిక్స్‌లోనూ రాణిస్తారని ఈ సందర్భంగా రవీంద్రబాబు పేర్కొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయాలకు రిపేర్లు

జిల్లాలో పలు తహశీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థలో వున్నాయి. వీటి మరమ్మత్తులకు గాను జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చొరవ తీసుకుని 1.66కోట్ల రూపాయలు విడుదల చేయించారు. ఈ నిధులతో నెల్లూరు (43లక్షలు), గూడూరు(10లక్షలు), చేజర్ల(4లక్షలు), కావలి(10లక్షలు), చిల్లకూరు(20లక్షలు), రాపూరు(10లక్షలు), కలువాయి(18లక్షలు), సూళ్లూరుపేట(10లక్షలు), వెంకటగిరి(20లక్షలు) తహశీల్దార్ కార్యాలయాల మరమ్మత్తులకు కేటాయించారు.

# సమన్వయం కుదిరింది



ఆత్మకూరు తెలుగుదేశంపార్టీలో వున్న వర్గ విభేదాలు ఒక దారికి వచ్చినట్లే కనిపిస్తోంది. అలకలు, అసంతృప్తులు సైలెంట్ అయ్యాయి. నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డి ఓ వైపు నుండి చక్క బెట్టుకుంటున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఆయనకు ఇచ్చారని తెలిసి అలిగి ఆటకమీద కూర్చున్న గూటూరు కన్నబాబును రెండ్రోజులకే లైన్‌లోకి తెచ్చారు. ఆనం సభను కన్నబాబే దగ్గ రుండి చూసుకోవడం తెలిసిందే! ఇక నియోజకవర్గంలో మరో ముఖ్యనాయకు డైన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డితోనూ ఆనంకు సమన్వయం కుదిరింది. మొన్న నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటి సమావేశానికి మెట్టుకూరు హాజరు కావడం జరిగింది. 2014 ఎన్నికల వరకు ఆనంకు మెట్టుకూరు ప్రధాన అనుచరుడే! 2009 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి ఆనం గెలుపు కోసం బాగానే కష్టపడ్డాడు. ఆ తర్వాత కూడా వారి అనుబంధం అలాగే సాగింది. 2014ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌లో వున్న నాయకులంతా వైసిపి, తెలుగుదేశంలోకి వెళ్లిపోయినా, మెట్టుకూరు మాత్రం ఆయనతోనే ఉండి పోయాడు. 2014ఎన్నికల్లో ఆనం పోటీ చేసి వదిలేసినా, ఆయన తరపున పనంతా మెట్టుకూరే చూసుకున్నాడు. 2014 ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ పూర్తిగా నిర్వీర్యం కావడంతో మెట్టుకూరు ఆ పార్టీని వదిలి తెలుగుదేశంలో చేరాల్సి వచ్చింది.

ఆనంను కాదని మెట్టుకూరు తెలుగుదేశంలో చేరడంతో ఇద్దరి మధ్య కొంత గ్యాప్ వచ్చింది. అయితే ఇప్పుడు మళ్లీ ఇద్దరూ ఒకే పార్టీలోకి రావడం, ఒకే నియోజకవర్గంలో కలిసిమెలిసి పని చేయాల్సిన అవసరం కలగడంతో ఇరువురి మధ్య సమన్వయం దానంతట అదే కుదిరింది.

# పరిసరాల పరిశుభ్రత.. మనందరి బాధ్యత

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి**



మనం నివసించే చోట, పనిచేసే చోట పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మౌలానా అహ్మద్ జునైద్ అన్నారు. 'స్వచ్ఛభారత్' స్ఫూర్తితో మంగళవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సహకారంతో జిల్లా కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, అపరిశుభ్రత వల్ల రోగాలు వస్తాయని, అందరూ పరిసరాలు పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలని అన్నారు. అనంతరం న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అక్కడున్న పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్నంతా తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జిలు శ్యామలాదేవి, నరసింహరాజు, పాపిరెడ్డి, మధుసూదన్‌రావు, సీనియర్ సివిల్ జడ్జిలు సత్యవాణి, భూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్‌జడ్జిలు, మెజిస్ట్రేట్‌లు కేశవ, వాసుదేవన్, శోభారాణి, పద్మ, పద్మశ్రీ, అరుణశ్రీ తదితరులతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఫణిరత్నం, ఆర్.రోజారెడ్డి, ఉపాధ్యక్షులు రవికుమార్, కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖరరెడ్డి, కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ నన్నేసాహెబ్, పలువురు న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, కృష్ణ చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

# విషజ్వరాలను అరికట్టండి



నెల్లూరు నగరంలో విషజ్వరాలు విస్తృతంగా ప్రబలి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచి విషజ్వరాలను అరికట్టాలని కోరుతూ మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి సభ్యులు బుధవారం జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. నగరం నిండా దోమలు, పందులు విజృంభించాయని, నెల్లూరు ప్రధాన ప్రభుత్వ వైద్యశాలలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందని, ఇక్కడి పరిస్థితులు కూడా మెరుగు పరచాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కమతం అశోక్, సాయిబాబు, ఎం.బాబు, మహేష్, నిషాద్, రహీమ్, చౌదరి పాల్గొన్నారు.

# మరో విజయానికి సిద్ధం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు అత్యంత నమ్మకమైన పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో మరో ప్రయోగానికి, ఇంకో విజయానికి శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్) సిద్ధమైంది. ఈ నెల 26వ తేదీ ఉదయం 9.12గంటలకు పిఎస్‌ఎల్‌వి-సి35 రాకెట్ ప్రయోగం జరుపనున్నారు. దీని ద్వారా 3స్వదేశీ, 5 విదేశీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి పంపనున్నారు. వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేస్తూ, తుఫాన్‌లను ముందుగానే పసిగట్టే 377కిలోల బరువుగల స్వదేశీ ఉపగ్రహం స్కాట్‌శాట్‌ను కక్ష్యలో ప్రవేశపెడతారు. అలాగే ముంబై ఐఐటి రూపొందించిన 10కిలోల ప్రథం ఉపగ్రహాన్ని, బెంగుళూరు ఇంజనీరింగ్ విద్యార్థులు తయారుచేసిన 5.3కిలోల పి.ఐశాట్‌ను, అల్జీరియాకు చెందిన 120కిలోల ఏఎల్‌శాట్-2బిని, 110 కిలోల ఎఎల్‌శాట్-1బిని, 7కిలోల ఏఎల్‌శాట్-ఎన్‌ను, అమెరికాకు చెందిన 50కిలోల ఫాత్‌ఫైండర్‌ను, కెనడాకు చెందిన 3.5కిలోల సిఎన్‌ఎక్స్-7 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెడతారు. ఈ ప్రయోగంతో కేవలం 30రోజుల్లోనే మూడు రాకెట్ ప్రయోగాలను విజయవంతం చేసిన ఘనత ఇస్రోకు దక్కుతుంది.




## 'ప్రభా'తం

శత్రువును పూర్తిగా చంపకుంటే ఎంతటి ప్రమాదమో చూస్తున్నాం. ఎంతటి నష్టమో తెలుసుకుంటున్నాం. శత్రువును చావుదెబ్బ కొట్టడానికి వచ్చిన అవకాశాలను చేజార్చుకున్న పాపానికి ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాం. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ వాళ్లతో పోరాడామంటే ఓ లెక్క వుంది. వాడు బయట శత్రువు. కాని స్వాతంత్ర్యం వచ్చాక కూడా మనం ఏర్పాటు చేసుకున్న శత్రువు పాకిస్థాన్‌తో నిరంతరం పోరాడుతూనే వున్నాం. ఆ పోరాటంలో లక్షలాదిమంది భారతీయుల ప్రాణాలను పణంగా పెడుతున్నాం. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో జరిగిన పొరపాట్లే ఈరోజు తూటాలై మనకు తగులుతున్నాయి. 1962లో భారత్‌తో యుద్ధానికి దిగి పాకిస్థాన్ తోక ముడిచింది. ఆరోజే భారత సేనలు ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా దాటిపోయి లాహోర్‌ను ఆక్రమించాయి. నెహ్రూ ఆరోజే సమయస్ఫూర్తితో వ్యవహరించి వుంటే పాకిస్థాన్ కోరలను అప్పుడే పీకి వుండొచ్చు. కాశ్మీర్‌ను భారత్‌లో పూర్తిగా విలీనం చేయడంలో నెహ్రూ వేసిన తప్పటడుగులు, చేసిన తప్పుడు విధానాలతో ఈరోజుకూ ఇరు దేశాల మధ్య కాశ్మీర్ సమస్య రావణకాష్టంలా రగులుతూనే వుంది.

కాశ్మీర్‌ను కబలించడానికి పాకిస్థాన్ గుంటనక్క ప్రయత్నాలు చేస్తూనే వుంది. భారత్‌పై ఎంత విషం చిమ్మాలో చిమ్ముతూనే వుంది. ఎంతగా దొంగ దెబ్బలు కొట్టాలో కొడుతూనే వుంది. ఒక ఎర్రకోట మీద దాడి... పార్లమెంట్‌పై దాడి... ముంబై దాడి... కలకత్తాలో పేలుళ్లు... జమ్మూ కాశ్మీర్‌లో అల్లర్లు... మొన్న పఠాన్‌కోట్ పై దాడి... ఎన్ని రకాలుగా తన రక్తదాహం తీర్చుకోవాలో అన్ని విధాలుగా ఉగ్రదాడులకు పాల్పడుతూనే వుంది. ఈ పరంపరలో మరో దొంగదెబ్బ తీసింది. జమ్ముకాశ్మీర్‌లోని యూరి సెక్టార్‌లో దేశ సరిహద్దుకు 6కిలోమీటర్ల దూరంలో వున్న భారత ఆర్మీక్యాంప్‌పై పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలు హఠాత్తుగా జరిపిన దాడిలో 18మంది వీరజవానులు ప్రాణాలు కోల్పోగా మరో 20మంది గాయపడిన సంఘటన భారత జాతిని యావత్తు కలవరపాటుకు గురిచేసింది. సైనికులు షిఫ్ట్ మారుతున్న సమయంలో వేలాది మంది సైనికులు ఆదమరిచి నిద్రిస్తున్న వేళ పాక్ ప్రేరేపిత ఉగ్రవాద ముఠా అదనుచూసి పిరికిపందలా దొంగదెబ్బ కొట్టింది. ఎ.కె 47లతో, గ్రెనేడ్లతో విరుచుకుపడిన ఉగ్రవాదులు సైనికులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. గ్రెనేడ్లతో సైనిక టెంట్లు మంటల్లో చిక్కుకోగా 14మంది సైనికులు ఆ మంటల్లోనే మృత్యువాత పడ్డారు. పఠాన్‌కోట్ తరహా దాడి మళ్లీ జరగవచ్చని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరిస్తూనే వున్నాయి. ఇటీవల కాలంలో పాకిస్థాన్‌లో అణచివేతకు గురవుతున్న బలూచిస్థాన్ నేతలు సైతం భారత్‌లో ఊహించని ఉగ్రదాడి జరగొచ్చని హెచ్చరించారు. పాకిస్థాన్ సరిహద్దుల నుండి కొన్ని ఉగ్రవాద మూకలు దేశంలోకి జొరబడ్డాయని ఐబి హెచ్చరికలు జారీ చేసిన మూడురోజుల్లోనే యూరి సంఘటన జరగడం దిగ్భ్రాంతి కలిగించేదే!

ప్రపంచంలో ఏ దేశం కూడా టెర్రరిజాన్ని ప్రోత్సహించడం లేదు. ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ వంటి దేశాలు సైతం ఉగ్రవాదంపై పోరాడుతున్నాయి. ప్రపంచంలోనే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాద శిబిరాలను నిర్వహిస్తూ, ఉగ్రవాదులకు, అంతర్జాతీయ మాఫియా డాన్‌లకు ఆశ్రయం కల్పిస్తున్న ఏకైక దేశం పాకిస్థాన్. ఇటీవల కాలంలో అంతర్జాతీయ వేదికల మీద భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని స్పష్టంగా వివరిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరులో అన్ని దేశాల మద్దతును కూడగడుతూ పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల కాలం వరకు పాకిస్థాన్‌ను నెత్తిన పెట్టుకుని మోసిన అమెరికా కూడా ఇప్పుడు దాని సంగతి తెలిసి దూరంగా పెట్టింది. భారత్‌తో స్నేహ సంబంధాలను కొనసాగిస్తోంది. ఒక్క చైనా మాత్రమే తన అవసరాల కోసం పాకిస్థాన్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది. చైనా అండ చూసుకునే పాకిస్థాన్ రెచ్చిపోతుంది. ఉగ్రవాద మూకలను ఏరివేయాలంటూ అంతర్జాతీయ సమాజం పాకిస్థాన్‌పై ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా ఫలితముండడం లేదు. ఎందుకంటే ఉగ్రవాద మూకలే ఈరోజు పాకిస్థాన్‌ను పాలిస్తున్నాయి, శాసిస్తున్నాయి. కాబట్టి ఉగ్రవాదం అక్కడ రాజ్యమేలుతున్నంతకాలం భారత్‌తో ఇలాంటి దాడులు తప్పవు.

### యుద్ధమే పరిష్కారం?



ప్రపంచంలో ఏ దేశం కూడా టెర్రరిజాన్ని ప్రోత్సహించడం లేదు. ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ వంటి దేశాలు సైతం ఉగ్రవాదంపై పోరాడుతున్నాయి. ప్రపంచంలోనే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాద శిబిరాలను నిర్వహిస్తూ, ఉగ్రవాదులకు, అంతర్జాతీయ మాఫియా డాన్‌లకు ఆశ్రయం కల్పిస్తున్న ఏకైక దేశం పాకిస్థాన్. ఇటీవల కాలంలో అంతర్జాతీయ వేదికల మీద భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని స్పష్టంగా వివరిస్తున్నారు.

యూరి సంఘటన తర్వాత పాకిస్థాన్ మీద దాడికి దిగాలన్నంత ఆవేశం భారత్‌లోని ప్రతి ఒక్కరిలో కనిపించింది. కేంద్రప్రభుత్వం ఈ సంఘటనను చాలా సీరియస్‌గా తీసుకుంది. ప్రపంచదేశాలు సైతం స్పందించి భారత్‌కు తమ మద్దతు తెలిపాయి. ముంబై దాడులు తర్వాత పాకిస్థాన్‌పై దాడికి భారత్ సంసిద్ధమైంది. పాకిస్థాన్ సరిహద్దులకు పూర్తి స్థాయిలో సైన్యాన్ని తరలించేలోపే అమెరికా నుండి వచ్చిన ఒత్తిడితో ఆరోజు యుద్ధ సన్నాహాలు విరమించుకోవాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు అదే వాతావరణం చోటుచేసుకుంది. ఈసారి పాకిస్థాన్ మీద దాడంటూ జరిగితే దాని నవనాడులు స్థంభించిపోయేటట్లు చేయాలి. అయితే యుద్ధం విషయంలో మనకు కొన్ని స్వీయనియంత్రణలున్నాయి. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలన్న ప్రయత్నంలో ముందుకు పోతున్నాం. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం పోరాడుతున్నాం. ఇక అణుశక్తి వున్నా అణ్వాయుధాలను ముందుగా ఉపయోగించబోమని ప్రకటించి వున్నాం. పాకిస్థాన్‌కు ఇలాంటి లక్ష్యాలు లేవు. ఒక్క ఉదాహరణలో చెప్పాలంటే ఐఏఎస్ ర్యాంకు కొట్టాలన్నది మన లక్ష్యమైతే, కిరాయి హత్యలు చేసి డబ్బులు సంపాదించాలన్న లక్ష్యం లేని మార్గం పాకిస్థాన్‌ది. ఆ దేశంతో యుద్ధం అంటే ఎంతో కొంత మనమూ నష్టపోక తప్పదు. ఒక్కసారి యుద్ధానికి దిగితే అభివృద్ధి పరంగా కొంతకాలం వెనక్కిపోక తప్పదు. అయితే పక్కలో బల్లెంలా వున్న పాకిస్థాన్ వల్ల కొన్ని లక్షల కోట్లను భద్రతా చర్యలకే ధారపోస్తున్నాం. శత్రువును సమూలంగా తుడిచి పెట్టేయవచ్చునుకుంటే పాకిస్థాన్‌పై ఇప్పుడే దాడికి దిగడం ఉత్తమం. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం అన్న మాటలను పక్కనపెట్టి అసలు ఉగ్రవాద తయారీ కేంద్రాలనే తుడిచి పెట్టే విధంగా గురిచూసి కొట్టాలి.

## క్రాప్‌లోన్ రెన్యూవల్ చేసుకోండి

-------------- సిండికేట్ బ్యాంకు డిజిఎం నరసింహమూర్తి



రైతు సోదరులు క్రాప్ లోను రెన్యూవల్ చేసుకొని ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను పొందాలని సిండికేట్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ నరసింహమూర్తి అన్నారు. సోమవారం నెల్లూరు వింటేజ్ హోటల్లో వ్యవసాయశాఖ మరియు బ్యాంకర్ల సమిష్టి పత్రికా సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ చాలామంది రైతుల్లో వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకుంటే రుణ విముక్తి పథకం కింద తమకు డబ్బులు రావని అపోహ వుందన్నారు. ఇది చాలా అవాస్తవమని, ఈ విషయాన్ని రైతు సోదరులు గమనించాలని ఆయన కోరారు. ఇప్పటికే రైతుల రుణవిముక్తి పథకం కింద రెండు విడతలు చెల్లించడం జరిగిందన్నారు. కాబట్టి రైతు సోదరులు వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకొని అదనపు లోను కూడా పొందడంతో పాటు వడ్డీలో కూడా రాయితీ పొందవచ్చన్నారు. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ హేమమహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైతాంగానికి రుణాలు అక్టోబర్ మాసంలోనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. కౌలుదారులకు మండల స్థాయి వ్యవసాయాధికారులు సర్టిఫికేట్ ఆఫ్ కల్టివేషన్ అనే పత్రాన్ని అందిస్తారని, దాని ద్వారా వారు బ్యాంకు నుండి పంట రుణాలు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటరావు, ఎ.జి.ఎం నాబార్డు రమేష్‌బాబు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ శివయ్య, సిండికేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆలస్యం చేయకుండా సబ్‌ప్లాన్ నిధులివ్వాలి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆ వర్గాల వారి అభివృద్ధికే ఖర్చు పెట్టాలని ఏపి దళిత ప్రజాసంఘాల ఐక్య వేదిక నెల్లూరుజిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఒక వినతిపత్రంలో జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎస్సీ, ఎస్టీ ఋణాలు వెంటనే విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను అర్హులైన వారికే ఇవ్వాలని, సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## రొట్టెలపండుగకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

వచ్చే నెల 13 నుంచి నెల్లూరులో ఎంతో వైభవంగా ప్రారంభం కానున్న రొట్టెల పండుగకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 18న నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదల అధికారులు, పర్యాటక శాఖ అధికారులు తదితరులతో కలిసి ఆయన నగరంలోని బారాషాహిద్ దర్గా ప్రాంగణాన్ని సందర్శించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పండుగకు దేశవిదేశాల్లోని పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. భక్తులసౌకర్యార్థం నెల్లూరు చెరువులో ఘాట్‌లు ఏర్పాటు చేసేందుకు, లైటింగ్ ఏర్పాట్లకు, గార్డెనింగ్‌కు పర్యాటకశాఖవారి సహకారంతో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు 2.62 కోట్లను మంజూరు చేశారని ఈ సందర్భంగా నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేస్తామన్నారు.

## పాక్ కోరలు పీకాలి




యూరిసెక్టార్‌లో ఆర్మీక్యాంప్‌పై దాడి చేసిన ఉగ్రమూకలు 17మంది సైనికులను హతమార్చడం దారుణం. ఉగ్రవాదాన్ని ఇంకా ఉపేక్షిస్తే లాభం లేదు. పాకిస్థాన్ అండదండలు లేకుండా ఉగ్రవాదులు ఇంతగా తెగించే ప్రశ్నే లేదు. ప్రపంచంలోనే ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న ఏకైక దేశం పాకిస్థాన్. ఈ దేశం పీచమణచాలి. ప్రపంచమంతా ఏకమై ఈ దేశం యొక్క ఆర్థిక మూలాలను క్రుంగదీయాలి. ఇతర దేశాల నుండి ఆ దేశానికి ఆర్థిక, సైనిక సహకారం లేకుండా చేయాలి.

సి.రాజీవి, నెల్లూరు.

### అమరావతి... అవినీతి

అవినీతికి కేరాఫ్ అడ్రస్ ఏంటంటే ఇప్పుడు అమరావతి రాజధాని అని చెప్పుకోవచ్చు. అనువుగాని చోట, నిపుణులు వద్దంటున్నా కూడా అమరావతి ప్రాంతాన్ని రాజధానికి ఎంపిక చేశారు. వేలకోట్ల రూపాయలు తగలేస్తున్నారు. తాత్కాలిక భవనాల పేరుతో ఇంకొన్ని వందలకోట్లు... 10వేల ఎకరాలలో 25మీటర్ల మేర ఎత్తు పెంచాలంటే... దీనికి ఎన్నివేల కోట్లు ఖర్చవుతాయో! రాజధాని పేరుతో జరుగుతున్న అవినీతికి అంతూపొంతూ లేదు.

- సి.రమేష్, నెల్లూరు.

### ఆంధ్రుల పౌరుషం ఇదేనా?

రాదు, ఇవ్వరు అన్న తెలంగాణను ఆ రాష్ట్ర ప్రజలు పోరాడి సాధించుకున్నారు. పార్లమెంటు సాక్షిగా ఇస్తాం అన్న ప్రత్యేక హోదాను మాత్రం ఆంధ్రులుగా మనం సాధించుకోలేకపోయాం. తెలంగాణకో తమిళనాడుకో ఇలాంటి అన్యాయం జరిగివుంటే ఆ రాష్ట్ర ప్రజలు వూరుకునే వాళ్లా? కేంద్రం దిగొచ్చేలా చేసుండే వాళ్లు. తమ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వాళ్లు పార్టీలకతీతంగా ఒక్కటవుతారు. కాని ఏపిలో ప్రజల్లో ఆ స్ఫూర్తి లేదు. అలాగే ఏపి ప్రజలకు ఈ రాష్ట్రంలో వున్న మీడియానే ప్రధాన శత్రువుగా మారింది.

- నారు సులోచన, నెల్లూరు.

## అంబరాన్నంటే సంబరంగా... ఆధ్యాత్మిక పండుగగా...

# సుబ్బరామన్న జన్మదినోత్సవ వేడుకలు



- ప్రముఖులతో కళకళలాడిన విశాఖ వేదిక
- ఘనంగా మోహన్‌బాబుకు 'నవరస నటతిలకం' బిరుదు ప్రదానం







**అందరికీ ప్రీతిపాత్రుడు.. అందరివాడు.. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ సభ్యులు... అయిన మన సుబ్బరామన్న జన్మదినోత్సవ వేడుకలు ఈ నెల 16, 17వ తేదీలలో విశాఖపట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో వైభావాతివైభవంగా జరిగాయి. కనీవినీ ఎరుగని విధంగా దేశంలో ప్రఖ్యాతిచెందిన పలు ఆలయాల నుంచి అర్చకస్వాములను, పీఠాధిపతులను, ఎందరో ప్రముఖులను ఆహ్వానించి ఈ ఉత్సవాలను తొలిరోజు ఆద్యంతం ఒక మహా ఆధ్మాత్మిక సంబరంగా నిర్వహించారు.**

విశాఖలోని కళాభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ దేవాలయాల ప్రధాన అర్చకులను టిఎస్సార్ ఘనంగా సత్కరించారు. అర్చకులందరూ టిఎస్సార్‌ను, విశాఖ ప్రజలను మనస్ఫూర్తిగా దీవించారు. ఈ సందర్భంగా దైవనామ స్మరణతో ఆడిటోరియం మార్మోగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముక్కామల క్షేత్రం పీఠాధిపతి శ్రీధర్‌స్వామి సుబ్బరామిరెడ్డికి స్వర్ణ నాగసర్ప ఢమరుకాన్ని, త్రిశూలాన్ని బహుకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, కంచి కామాక్షి, మధుర మీనాక్షి, విజయవాడ కనకదుర్గమ్మ, అమరావతి రామలింగేశ్వరస్వామి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అయ్యప్పస్వామి ఆలయం, పూరి జగన్నాథ్ క్షేత్రం, హైదరాబాద్‌లోని సంతోషిమాత దేవాలయాల ప్రధాన అర్చకులు పఠించిన వేద ఆశీర్వాదాలు అందరినీ పరవశింప జేశాయి.

ప్రముఖ గాయనీ గాయకులు సుహాసిని ఆనంద్, విశాఖ భగవతి, పవన్ తదితరుల భక్తిగీతాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళంవారు ప్రదర్శించిన 'గయోపాఖ్యానం' పద్య నాటకం అద్భుతంగా వుండి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైనవారిని టిఎస్సార్ దుశ్శాలువా, అమ్మవారి ప్రతిమతో పాటు 5 వేల రూపాయల నగదు బహుమానంతో సత్కరించారు.

విశాఖ స్వామి స్వరూపానందేంద్ర ప్రధాన శిష్యుడు శ్రీ కృష్ణశర్మస్వామీజీతో పాటు, వివిధ రంగాల్లోని ప్రతిభావంతులను ప్రత్యేకంగా టిఎస్సార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, సినీరంగ, ధార్మికరంగ ప్రముఖులు విచ్చేసి సుబ్బరామన్నకు జన్మదినోత్సవ శుభాశీస్సులు తెలియజేశారు. దేశప్రగతిని, శాంతిని కోరుకుంటూ జరిగిన ఈ ఆధ్యాత్మిక పండుగకు విచ్చేసిన ప్రముఖులు, స్వామీజీలు, సినీరంగ ప్రముఖులతో విశాఖతీరం కళకళలాడింది.


తన పుట్టినరోజైన సెప్టెంబర్ 17న జరిగిన రెండవరోజు వేడుకలలో కళా రంగం పట్ల తనకున్న మక్కువను చాటుకున్నాడు సుబ్బరామిరెడ్డి.



## 'భక్తి-సేవ... ఈ రెండూ నాకు రెండు కళ్ళు'

**- టిఎస్సార్**

తన పుట్టినరోజు వేడుకల్లో టిఎస్సార్ మాట్లాడుతూ, భక్తి-సేవ తనకు రెండు కళ్ళ వంటివని అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు. "నా పుట్టిన రోజునాడు విశాఖను ఒక ఆధ్యాత్మిక నగరంగా చూడాలనుకుంటాను. అందుకే ప్రతి ఏటా నా పుట్టినరోజునాడు ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నాను. సాటి మనిషికి సేవ చేయడమే ఈశ్వరారాధన అని నమ్మే వ్యక్తిని నేను".. అంటూ అందరి హర్షధ్వానాల మధ్య టిఎస్సార్ ప్రసంగించారు. ప్రత్యేకించి విశాఖ ప్రజలంటే తనకెంతో అభిమానమని, అందుకే ప్రతి పుట్టినరోజును విశాఖలో జరుపుకుంటానని, అది తనకెంతో ఆనందమని అన్నారు. మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ కలిగిన ప్రముఖ నటుడు డా.మోహన్‌బాబు నాలుగు దశాబ్దాల నటప్రస్థాన వేడుకలను కూడా నా పుట్టిన రోజున జరుపుకోవడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని, ఇది తనకో మరచిపోలేని అనుభూతి అని అన్నారు.



ఈ వేడుకల్లో భాగంగా, 17వతేదిన డా.మోహన్‌బాబుకు టిఎస్సార్ లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో ఘనమైన సత్కారం జరిగింది. అందరి కరతాళధ్వనుల మధ్య డా.మోహన్‌బాబుకు ఎంతో విశిష్టమైన 'నవరస నటతిలకం' అనే బిరుదును ప్రదానం చేసి, స్వర్ణకంకణం తొడిగారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటి ఛైర్మెన్ పి.జి కురియన్ మాట్లాడుతూ, మోహన్‌బాబు ఏ పాత్రనైనా చేయగలడని, ఆయనకు దేశవ్యాప్తంగా అభిమానులున్నారని, అంతేకాక, ఆయన బెస్ట్ పార్లమెంటేరియన్ అని (మిగతా 10వ పేజీలో)







# నెల్లూరంతా నిఘా కళ్ళు

**నెల్లూరు నగరంపై నిఘాకళ్లు వేలాడుతున్నాయి. ఎక్కడ ఏం జరిగినా, ఎక్కడ ట్రాఫిక్‌జాం అయినా, ఎక్కడ వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్‌ను అధిగమించినా, ఎక్కడ అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపినా జిల్లా పోలీసు కార్యాలయానికి ఇట్టే తెలిసిపోతుంది. ట్రాఫిక్‌రూల్స్ అతిక్రమించిన వాహనదారుడి ఇంటికి పక్కరోజే పెనాల్టీ నోటీస్ వస్తుంది.**

నెల్లూరు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ విశాల్‌గున్నీ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నగరాన్ని కొన్ని రింగ్‌లుగా విభజించారు. వీటిలో ప్రధానమైన రింగ్ కె.వి.ఆర్ పెట్రోల్ బంకు నుండి మొదలై ఆర్టీసీ, విఆర్‌సి, గాంధీబొమ్మ, ఏ.సి సెంటర్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, మినీబైపాస్‌ల మీదుగా బెజవాడ



గోపాలరెడ్డి బొమ్మ వద్ద టర్న్ తిరిగి మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డు గుండా తిరిగి కెవిఆర్ పెట్రోల్ బంకు వద్ద కలుస్తుంది. ఈ రింగ్‌లో సిసి కెమెరాల ఏర్పాటు పూర్తయ్యింది. ఓ ప్రైవేట్ కేబుల్ నెట్‌వర్క్ లైన్ల ద్వారా ఈ కెమెరాలన్నింటిని పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సిస్టంకు అనుసంధానం చేశారు. ఈ రింగ్‌లోని ప్రాంతాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకున్నా, నేరాలు జరిగినా, లేక ట్రాఫిక్ సమస్యలు ఎదురైనా పోలీసులు తక్షణం స్పందించడానికి అవకాశముంటుంది. అలాగే నేరగాళ్లను పట్టుకోవడానికి సి.సి కెమెరా విజువల్స్ బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులభమవుతుంది. మొదటి రింగ్‌లో కీలక ప్రాంతాలన్నీ నిఘా పరిధిలోకి వచ్చాయి. తదుపరి మిగతా ప్రాంతాల్లో కూడా సి.సి కెమెరాలు ఏర్పాటు కొనసాగనుంది.

## నెల్లూరు కబుర్లు

## ఉగ్రవాద దిష్టిబొమ్మ దగ్ధం



కాశ్మీర్‌లోని యూరీ సైనిక శిబిరంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ భారతీయ జనతాపార్టీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ నెల్లూరులో పాకిస్థాన్ ఉగ్రవాద దిష్టిబొమ్మను తగులబెట్టారు. విఆర్‌సి నుండి గాంధీబొమ్మ వరకు ఉగ్రవాద దిష్టి బొమ్మను లాక్కెళుతూ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో అమరులైన జవాన్‌లకు జోహార్లర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సైనిక శిబిరంపై ఉగ్రవాదుల దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించాడు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ నాయకులు ఎం.ఈశ్వరయ్య, కుడుముల సుధాకర్‌రెడ్డి, మొగరాల సురేష్, జంపాల బుజ్జమ్మ, పొట్లూరి శ్రీనివాసులు, గడ్డం విజయకుమార్, కామేశ్వరమ్మ, కాకరపర్తి జగన్మోహన్, వై.రామిరెడ్డి, దాసరి ప్రసాద్, ఉదయ్, ఫణి, సాయిశ్రీనివాసులు, ప్రసాద్, జయచంద్ర, షాజహాన్, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల ఉదారత



విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలను ఆదుకునేందుకు సాటి హోంగార్డులు తమ వితరణ గుణం చూపించారు. వారి కుటుంబాల కోసం ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ నెల 19వ తేదీన నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ చేతులమీదుగా ఇటీవల మరణించిన జి.సరస్వతి కుటుంబానికి 1,74,900 రూపాయలు, కె.రవీంద్ర కుటుంబానికి 2,34,000రూపాయలు, కె.సతీష్ కుటుంబానికి 2,37,600 రూపాయలు అందజేశారు. అలాగే విధి నిర్వహణలో 60ఏళ్లు పూర్తి చేసుకుని పదవీ విరమణ చేసిన శ్రీమతి కె.కోటేశ్వరమ్మకు 2,33,600రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శరత్‌బాబు, హోంగార్డ్స్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ హుస్సేన్, హోంగార్డ్‌ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కడియంపాటి రవిబాబు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు నితీష్



విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు నెల్లూరు కొండాయపాలెంలోని వాత్సల్య హైస్కూలు (భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు) విద్యార్థి సిహెచ్ నితీష్(4వ తరగతి) రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి త్వరలో జాతీయ స్థాయిలో రాంచీ నగరంలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వాత్సల్య కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు, వాత్సల్య సహాయ కార్యదర్శి టి.వి.యస్. దుర్గాప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.మధుసూదనరెడ్డి నితీష్‌ను ఘనంగా సత్కరించారు.

### యం.యస్.సుబ్బులక్ష్మికి
## విద్యార్థుల నివాళులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన భారతరత్న డా॥ యం.యస్. సుబ్బులక్ష్మి శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు గాత్రకచ్చేరి, వీణ కచ్చేరి, భరతనాట్య ప్రదర్శనలు శ్రోతలను రంజింప చేసాయి. వయోలిన్‌పై రవికుమార్, మృదంగంపై బి.వి.సుబ్రహ్మణ్యం, వీణ విద్యార్థులు పి.ఫణికుమారి, యం.జయలక్ష్మి, డి.రాజ్యలక్ష్మిల కచేరీలు అలరించాయి. పాఠశాల భరతనాట్య విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పంచాగ్నుల వేంకట విశ్వనాథం, రాళ్ళపల్లి సుబ్బులక్ష్మి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### బొజ్జా తారకంకు
## న్యాయవాదుల జోహార్లు

నెల్లూరు అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్(అ,ఆ ఫౌండేషన్) ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, సామాజిక సంస్కర్త, దళిత పోరాట యుద్ధవీరుడు బొజ్జా తారకంకు నెల్లూరు న్యాయవాదులు ఇటీవల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ జల్లి పద్మాకర్, జిల్లా అధ్యక్షులు యన్.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి ఏ.దొరస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు యన్.వెంకయ్య, బద్దెపూడి రవి, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కుడుముల రవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈదూరు భాస్కరయ్యలు పాల్గొని నివాళులర్పించారు.

# కిలారికి కుర్చీ ఖరారు!



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్‌గా తెలుగుదేశం పార్టీ నెల్లూరురూరల్ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామి నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే ఆయనకు ఈ పదవి ఖరారైనా అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు. కిలారి వాస్తవంగా కోరుకున్న పదవి ఇది కాదు. నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ కావాలనుకున్నాడు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పూసల రంగయ్యకు ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవి ఇచ్చారు. ఆయన తర్వాత ఇంకెవరినీ ఈ పదవిలో నియమించలేదు. రీజియన్ ఛైర్మెన్‌లు లేకుండానే ఇ.డి, ఆర్ఎంలు రీజియన్ స్థాయిలో ఆర్టీసీ వ్యవహారాలు చూస్తున్నారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక కిలారి వెంకటస్వామినాయుడు ఈ పదవిపై మోజుపడ్డాడు. 2014 ఎన్నికల్లో ఆయన నెల్లూరురూరల్ సీటు ఆశించాడు. అది బీజేపీ కోటాలో పోయింది. దానికి ప్రతిఫలంగా ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవినన్నా ఇవ్వండని కోరాడు. అయితే విభజన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ ఆస్తుల పంపకాలు జరగలేదు. దీంతో ఇప్పట్లో ఈ పదవిని ఇవ్వలేమని, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవి అయితే వెంటనే ఇవ్వగలమని అధిష్టానం చెప్పడంతో కిలారి ఇక చేసేదేమీ లేక ఆ పదవినే మహాప్రసాదంగా స్వీకరించాడు.

## బులియన్ మర్చంట్స్ సేవలు ప్రశంసనీయం



నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్‌వారు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతైనా ప్రశంసనీయమని డిప్యూటి మేయర్, జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ కొనియాడారు. ఈ అసోసియేషన్ ఏర్పాటై పాతికేళ్ళు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సిల్వర్‌జుబ్లీ వారోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు రంగ నాయకులపేటలోని అసోసియేషన్ భవనం ప్రాంగణంలో ఈ నెల 18వ తేది బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. సోమవారం రాత్రి బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలలో సిహెచ్ శరణ్‌కుమార్, లక్ష్మణ్‌లు విన్నర్స్‌గాను, గౌతమ్, హరి రన్నర్స్‌గాను నిలిచారు. అదేవిధంగా, ఈ నెల 24, 25 తేదీల్లో స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు, సత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుంది. 25న రంగనాయకులపేటలోని అసోసియేషన్ భవనంలో జరిగే ముగింపుసభలో క్రీడల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం వుంటుంది. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శి సురేష్‌బాబు, పాబోలు నాగేశ్వరరావు, కోశాధికారి ముంజులూరు శ్రీనివాసులు, బయ్యా ప్రసాద్, గంగిశెట్టి మల్లికార్జునరావు, పాంచజన్యం, పల్లేటి సురేష్, కొలిపాకులు సురేష్‌బాబుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు.

## 'చైతన్యస్రవంతి' పుస్తకావిష్కరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి యారాసి రాఘవయ్య రచించిన 'చైతన్యస్రవంతి' నానీల పుస్తకావిష్కరణ ఈ నెల 20న జరిగింది. స్థానిక దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కవులు-రచయితల సంఘం అధ్యక్షుడు విద్వాన్ కిరణశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కవి చీమకుర్తి వెంకటేశ్వరరావు పుస్తకసమీక్ష చేస్తూ, కవికి మానవీయ సంవేదన, ఆర్తి, ఆర్ద్రత, భావుకత, దేశభక్తి మెండుగా వుండాలన్నారు. రాఘవయ్య కవిత్వంలో ఇవన్నీ పుష్కలంగా వున్నాయని కొనియాడారు. మరో సీనియర్ కవి పాయసం సుబ్రహ్మణ్యమహర్షి మాట్లాడుతూ, యారాసి రాఘవయ్య కవిత్వంలో మానవత్వపు పరిమళాలు గుభాళిస్తున్నాయని ప్రశంసించారు. ఈ పుస్తకాన్ని ఇందుకూరుపేటలోని శ్రీ లలితా మహేశ్వరి ఆశ్రమం స్వామీజీ సిద్ధగురు శ్రీ రామాయణం మహేష్‌స్వామీజీకి అంకితం ఇచ్చి, తొలి ప్రతిని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా కృతికర్త యారాసి రాఘవయ్యను పూలమాలలతో సత్కరించారు. ప్రముఖ కవి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కవులు-రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్, ఆలూరి శిరోమణిశర్మ, పెరింబేటి అన్నపూర్ణా సుబ్రహ్మణ్యం, తోట సులోచన, అవ్వారు శ్రీధరబాబు, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, సుభద్రాదేవి, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, హెచ్ఎల్ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు స్టాండింగ్ ఆమోదం!

**నెల్లూరు నగరపాలక సంస్థ అవినీతికి అన్నగా అక్రమాలకు తమ్ముడిగా మారిందన్నది నగ్నసత్యం. ఇక్కడ పాలకులకు వ్యాపారం తప్పితే పరిపాలనపై శ్రద్ధలేదు. అసలు పరిపాలనపై దృష్టి కూడా లేదు. నెల్లూరు నగరాన్ని పాడి ఆవుగా చూస్తున్నారు. ఎంత మేరకు పిండుకోవాలన్నదానిపైనే మనసు లగ్నం చేశారు. కార్పొరేషన్‌నే ఒక వ్యాపార సంస్థగా మార్చి ఇక్కడే కలెక్షన్ సెంటర్‌లు పెట్టేసినట్లుగా వుంది పరిస్థితి.**

ఈ అక్రమాల పరాకాష్టకు ఈ నెల 19వ తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశమే ఒక ఉదాహరణ. స్టాండింగ్ కమిటి సభ్యులంతా అధికారపార్టీ వారే! మేయర్ ముందుగానే కమిటీ సభ్యులతో ఒప్పందం కుదుర్చుకుని తనకిష్టమైన అంశాలతో అజెండాను రూపొందించుకున్నారు. ఈ అజెండాకు ఎవరూ అభ్యంతరం పెట్టకూడదని ముందుగానే ఒప్పించుకున్నారు. ఈ అజెండాలో వివాదాస్పద అంశం కార్పొరేషన్ తరపున నడిపే 'ఈ న్యూస్' పేపర్‌కు ఎడిటర్‌గా తన అనుచరుడు రఫీని నియమించుకున్నారు. దీనిని స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదముద్ర వేయించుకున్నారు. 5ఏళ్ల కాలానికి అతనికి అగ్రిమెంట్ ఇచ్చారు. అతని జీతం నెలకు 50వేల రూపాయలుగా నిర్ణయించారు. ఇక అతనికి నలుగురు సహాయకులను పెట్టారు. ఒక్కొక్కరికి 18వేల రూపాయలు జీతం. దినపత్రికలలో, న్యూస్ ఛానెల్స్‌లో ఏళ్లతరబడి పనిచేస్తున్న సీనియర్ పాత్రికేయులకు 20వేలకు మించి జీతాలు రావడం లేదు. 'ఈ న్యూస్' పక్ష పత్రిక. దీనికి పెద్ద పని కూడా ఉండదు. దీనికి ఇంత జీతమేంటని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

ఇక అజెండాలో మినీబైపాస్ రోడ్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్ డివైడర్‌లను కూడా మెయింటెనెన్స్ పేరుతో దాదాపు 50లక్షలకు టెండర్ పెట్టారు. డివైడర్‌లను కార్పొరేషన్ మెయింటెనెన్స్ చేయాల్సిన పనిలేదు. వ్యాపార సంస్థలకు అప్పగిస్తే డివైడర్ల మధ్యలో వాళ్లు తమ సంస్థ హోర్డింగ్‌లను పెట్టుకుని, దానికి ప్రతిఫలంగా మెయింటేన్ చేయగలరు. ఇలాంటి వాటి పేరు చెప్పి ప్రజల డబ్బులు దోచుకోవడం ఒక ఆచారంగా మారిపోయింది.



# ప్రగతికి ముఖద్వారంగా పోర్టు!



ఆంధ్రప్రదేశ్ ప్రగతికి కృష్ణపట్నం పోర్టు ముఖద్వారం కానుందని కేంద్ర అణుశక్తి, అంతరిక్ష, పిఎంఓ శాఖల సహాయమంత్రి జితేంద్రసింగ్ కితాబిచ్చారు. ఈ నెల 18న ఆయన పోర్టును సందర్శించారు. పోర్టు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. పోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. పోర్టు సెక్యూరిటీ అకాడమీని సందర్శించి వారి గౌరవ వందనం స్వీకరించారు. పోర్టులో వున్న ఆధునిక వంటశాలను కూడా ఆయన చూశారు. కృష్ణపట్నం పోర్ట్ అకాడమీ రూపొందించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సివిఆర్ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న కోటి మొక్కల ఉద్యమాన్ని, స్వచ్ఛభారత్ నిర్వహణను అభినందించారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన పోర్టుగా ఎదిగేందుకు ఇక్కడ అన్ని అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ చింతా శశిధర్, సిఇఓ అనిల్ ఎండ్లూరి, పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక ఊరట!

- ప్రస్తుతానికి ఆదుకోవడానికి సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- సాయమా? ఋణమా? తేలని వైనం





నెల్లూరు నగరంలో మంచినీటి పైప్‌లైన్‌లు, భూగర్భడ్రైనేజీ పనులకు సంబంధించి పీటముడి పడడం తెలిసిందే! 1137.62 కోట్ల హడ్కో ఋణంతో ఆర్భాటంగా ఈ పనులు మొదలెట్టారు. నగరం నిండా పైపులు తోలి ఓ పక్క నుండి పనులు కూడా ప్రారంభించారు. కేంద్రం స్థాయిలోనే ఈ పనులను ఎల్ అండ్ టి, మెగా ఇంజనీరింగ్ కంపెనీలకు చెరోపని అప్పగించారు. హడ్కో పనుల మూలంగా నెల్లూరు నగర పాలకులకు అనధికారికంగా నయాపైసా ఆదాయం లేని పరిస్థితి. ఇది వారిలో కొంత అసంతృప్తే! ఇక పనులు మొదలు పెట్టారు కాబట్టి కాంట్రాక్టర్‌కు మొదటి బిల్లు చెల్లించాల్సి వచ్చింది. కార్పొరేషన్ తన వాటాగా 6కోట్లు చెల్లించాల్సి వచ్చేసరికి మా వద్ద నిధులు లేవంటూ చేతులెత్తేయడం జరిగింది. హడ్కోకు ముందుగానే 10శాతం తన వాటా క్రింద 115కోట్లు చెల్లించాలి. కార్పొరేషన్ వార్షికాదాయమే 100కోట్లు దాటనప్పుడు, ఇంత డబ్బు ఎక్కడ నుండి వస్తుంది. ఇక మేయర్, కార్పొరేటర్లు కలిసి బ్యాంకులకు కన్నాలు వేయాలి? అదీగాక మూడు నెలలకోసారి కోట్ల రూపాయల్లో వాయిదాలు కట్టాలి. ఇంత డబ్బు చెల్లించే పరిస్థితి మా వద్ద లేదని కార్పొరేషన్ చేతులెత్తేయడంతో ఈ రెండు పనులు ఆగిపోయే పరిస్థితి వచ్చింది.

తన హయాంలో తన నగరంలోనే ఈ పనులు ఆగిపోతే తన పరువు ప్రతిష్టకు భంగం కలగొచ్చని మున్సిపల్ మంత్రిగా నారాయణ భయపడుతున్నాడు. అలాగే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు సొంత ఊరు కూడా ఇదే కావడంతో ఇద్దరికీ ఈ సమస్య ప్రతిష్టాత్మకంగా మారింది. వెంకయ్యనాయుడు, నారాయణలిద్దరూ పూనుకుని హడ్కో ఋణాన్ని గ్రాంటుగా మారిస్తేగాని ఈ పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించలేదు. ఈ దశలో సబ్జెక్ట్ చంద్రబాబు దాకా పోవడంతో ప్రస్తుతానికి హడ్కోకు చెల్లించాల్సిన 115కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడానికి ఒప్పుకుంది. అయితే ఈ ఋణాన్ని నెల్లూరు నగరపాలక సంస్థలో అప్పు క్రింద లెక్కేస్తారా? లేక గ్రాంటు క్రింద మంజూరు చేస్తారా? అన్నది తేలాల్సివుంది!

# అర్హులైన అందరికీ పింఛన్లు ఇవ్వాలి

### - ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ బోడిగాడితోట, అరవపాళెం, బర్మాషాల్ గుంట ప్రాంతాల్లో గడప గడపకు వైయస్సార్సీపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 3సంవత్సరాలు కావస్తున్నా అర్హులైనవారందరికీ పింఛన్లు మంజూరు చేయకుండా నామమాత్రంగా పింఛన్లు ఇస్తూ ప్రచార ఆర్భాటాలతో సరి పెట్టుకుంటోందన్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వం వెంటనే పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో అనేక పెద్దపెద్ద ఎస్సీ కాలనీలు ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ నిధులు కేటాయించడంలో మాత్రం కార్పొరేషన్ పాలకులు అన్యాయం చేస్తున్నారన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి నగర కార్పొరేషన్‌కు ఎక్కువగా పన్నులు రూపంలో నిధులు వస్తున్నాయని గుర్తుంచుకొని, ఖచ్చితంగా నగర నియోజకవర్గానికి రావాల్సిన అభివృద్ధి నిధులు వెంటనే కేటాయించాలని, లేని పక్షంలో ప్రజలను, అన్ని పార్టీలను కలుపుకుని ఉద్యమిస్తామని హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ రవిచంద్ర, వైయస్సార్సీపీ నాయకులు సిద్ధు రమణారెడ్డి, ఎ.శోభన్ బాబు, పాడేరు పెంచలయ్య, నాగేంద్ర, సుకుమార్, బషీర్, జయకృష్ణ, జీలు, కిరణ్, పఠాన్ మాబాషా, బి.హరిప్రసాద్ నాయుడు, వంగాల శ్రీనివాసులురెడ్డి, ఎస్ఆర్ ఇంతియాజ్, శివపురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అక్టోబర్ మాసం నుండి పారిశుద్ధ్యంపై అధికారులు తగుశ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాల రాజు అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తప్పనిసరిగా తమ పరిధిలో వున్న గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. రాబోవు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తుంటాయని, వాటిని రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల డేటాలను సేకరించి గత నాలుగైదు సంవత్సరాలలో ఆయా గ్రామాలలో వచ్చిన సీజనల్ వ్యాధులను పరిశీలించి, అవి ప్రబలుటకు అవకాశం వున్న గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచాలన్నారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖచే వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటు వైద్యఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో తిరిగి ప్రజారోగ్యం గురించి ఎప్పటికప్పుడు పరిశీలించాలని, మరికొన్ని గ్రామ పంచాయితీలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా త్వరలోనే ప్రకటించాలని వారికి అడ్వాన్సు పేమెంటు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులు పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు రీజాయిండర్ ఇవ్వడంతో పాటు వాటి వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి. ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్-2 ఆర్.ఎస్.రాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మార్కండేయులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### గొలగమూడిలో..
# వైభవంగా స్వామివార్ల కళ్యాణోత్సవాలు

గొలగమూడిలో నూతనంగా నిర్మించిన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి కళ్యాణమండపంలో ఈ నెల 18వ తేదిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కళ్యాణమహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానాలు, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర మహోత్సవ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. టిటిడి నుంచి విచ్చేసిన ప్రముఖ వేదపండితులచే నిర్వహించిన ఈ కళ్యాణోత్సవం ఆద్యంతం కనువిందుగా సాగి, భక్తులను విశేషంగా ఆకట్టు కుంది. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. అనంతరం ఎంతో వేడుకగా స్వామివార్లకు పుష్పయాగం జరిగింది. గొలగమూడి ఆశ్రమం ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖులు ఈదూరు రామ్మోహనరెడ్డి, సూదులగుంట నాగార్జున తదితరులతో పాటు మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, కొండా బలరామిరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఇ.కె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ఈ ఉత్సవాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు వివిఎస్ వినోద్ కుమార్ గానం చేసిన అన్నమాచార్య



సంకీర్తనలు భక్తులను అలరించాయి. అదేవిధంగా, 19వ తేదిన శివపార్వతుల కళ్యాణమహోత్సవ సేవాసమితి-నెల్లూరువారి ఆధ్వర్యంలో, ఆ సేవాసమితి గౌరవాధ్యక్షులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, అధ్యక్షుడు మద్దిక కృష్ణారెడ్డి, నిర్వాహకుడు ఇ.కె సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన శివపార్వతుల కళ్యాణోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం, భక్తులందరికీ ప్రసాద వితరణ జరిగింది.

### విశ్వబ్రాహ్మణ పెద్దలకు
# గౌరవ ఆత్మీయ సన్మానం



నెల్లూరు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సేవాసంస్థ నేతృత్వంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఉదయం విశ్వబ్రాహ్మణ పెద్దలు, వివిధ రంగాలలో నైపుణ్యం వున్న వారికి గౌరవ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నెల్లూరు కుక్కలగుంట రాజేంద్రనగర్ మురళీకృష్ణ మందిరంలో జరిగింది. సేవా సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాన వెంకట శేషయ్య ఆచారి, లేబూరు గోపికృష్ణ ఆచారిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగగా, ప్రత్యేక ఆహ్వానితులుగా నెల్లూరుజిల్లా బిసి కులాల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకటస్వామి పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రొంపిచెర్ల శివరామయ్య ఆచారి, నెల్లూరు పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరు చెంగయ్య ఆచారి, సూపరిం టెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఎన్.నాగశయనరావు అచారి, లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు పేర్ల సీతారామారావు, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అర్చకులు కుర్చేటి తాండవ కృష్ణమూర్తిలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు




మాట్లాడుతున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, పాల్గొన్న డిఇవో మువ్వా రామలింగం, డాక్టర్ సిఆర్‌రెడ్డి తదితరులు

గూడూరు పట్టణం లోని డిఆర్‌డబ్ల్యు కళా శాలలో రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వ ర్యంలో, రాయల్ సొసైటి ఆఫ్ కెమిస్ట్రీ సంస్థ పర్యవేక్షణలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ సౌజ న్యంతో రెండురోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ మువ్వా రామలింగం పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశంలోని విషయాలే కాకుండా జీవితాన్ని, ధైర్యాన్ని నేర్పించడం వల్ల విద్యార్థి ప్రయోజకుడవుతాడని అన్నారు. డాక్టర్ సిఆర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉపా ధ్యాయులు చదువులో మంచిస్థితికి తీసుకురావాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతను ఇస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై. స్నేహలతారెడ్డి మాట్లాడుతూ మా సంస్థ స్థాపించినప్పటి నుండి పేద విద్యార్థుల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలను రూపొందించి సహాయసహకారాలందిస్తున్నామన్నారు. వికలాంగులకు, వయోవృద్ధులకు ప్రమాదంలో గాయపడిన వారికి చదువుకొనేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగసూరి గోపాలరావు, డాక్టర్ సి.రోహిణి, దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్, ఎం.దయాకర్‌రెడ్డి, కార్యదర్శి హరిప్రసాద్, అశోక్‌చక్రవర్తి, నాగేంద్రప్రసాద్, బలరామయ్య, లక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి
### - గోపాల్‌యాదవ్



మాట్లాడుతున్న అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ప్రక్కన మునిగిరీష్

గూడూరు ప్రజల ఆరోగ్యంపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షుడు వీరిబోయిన గోపాల్ యాదవ్ తెలిపారు. పట్టణంలో ఆదివారం పిసిసి ప్రతినిధి కె.మునిగిరీష్‌తో కలసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సిబ్బంది తక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో కార్మికుల సంఖ్యను పెంచాలని, పట్టణంలో నిబంధనలు లేకుండా చికెన్, మాంసం దుకాణాలు ఏర్పాటు చేయడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని, దీనిపై పర్యవేక్షించాల్సిన ఫుడ్ ఇన్స్‌పెక్టర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సిబ్బంది పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముత్యాలయ్య, కిషోర్, పద్మ, ముర్తుజా, శరత్‌యాదవ్, కార్తీక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ న్యాయ దినోత్సవం

గూడూరు హనుమంతరావునగర్‌లో సీనియర్ న్యాయవాది యరగుడిపాటి రామారావు గృహంలో ప్రపంచ న్యాయదినోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాది రామారావు దగ్గర జూనియర్ న్యాయవాదులుగా పనిచేసిన వెంకటగిరి సీనియర్ న్యాయవాది బీరం రామదాసుకి సన్మానం జరిగింది. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో రామారావు గారి దగ్గర వృత్తిలో మెలకువలు నేర్చుకొని అభివృద్ధిలోకి వచ్చానని, నీతి నిజాయితీలతో వృత్తిని అంకితభావంతో చేపట్టానని తెలి పారు. ఈ సందర్భంగా న్యాయవాది, బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ జాతీయ న్యాయదినోత్సవం నాడు తాను జన్మించి, అదే వృత్తిలో గత 38సంవత్సరాలుగా కొనసాగుతూ తన తండ్రి దగ్గర నేర్చుకున్న మెలకువలు, నిబద్ధత తన సోదర న్యాయవాదుల సహకారం, కక్షిదారుల ప్రోత్సాహం అభివృద్ధిపథంలో నడిపిందని తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు అదనపు జిల్లా జడ్జి కోర్టు పబ్లిక్



సత్కారాలందుకున్న న్యాయవాదులు

ప్రాసిక్యూటర్ వై.సుహాసినిని, గవర్నమెంట్ ప్లీడర్ కె.వి.కృష్ణయ్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత్‌కుమార్‌ను, ఏవో శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. తోట సురేష్, మల్లు విజయకుమార్ రెడ్డి, నవీన్ జయకుమార్, బ్రాహ్మణ సంఘం తరపున ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, డి.బాలశ్రీనివాస్ చలపతిరావు జన్మదినం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని ఘనంగా సన్మానించారు.

### ఎస్.వి.రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో
# ఉచిత వైద్య శిబిరం




విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గూడూరు రెండో పట్టణంలోని బిసి బాలికల వసతిగృహంలో ఆదివారం ఉదయం ఎస్వీ రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి ఉచి తంగా మందులను పంపిణీ చేశారు. వెస్ట్‌క్లబ్ అధ్యక్షుడు శేగు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంత చదువు చదివినా ఆరోగ్యంగా లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉంటుందని, ఆరోగ్యం విలువ తెలుసు కుని తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల నిత్యం శ్రద్ధ తీసుకుంటే జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. దాతలు చేస్తున్న సేవలను మరువకుండా ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చంద్రహాస్, ప్రకాశ్, రొటేరియన్లు ఎన్.ఎస్.రెడ్డి, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, వాసుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నాశిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా జెండా మహోత్సవం
### - పట్టణ సిఐ సుబ్బారావు



మాట్లాడుతున్న పట్టణ సిఐ సుబ్బారావు

గూడూరు పట్టణంలో ఈ నెల 30వ తేదీ అత్యంత వైభ వంగా నిర్వహించే ఆంజనేయస్వామి జెండా మహోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని పట్టణ సిఐ సుబ్బారావు తెలిపారు. గూడూరు ఒకటోపట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆంజనేయ స్వామి జెండా నిర్వాహకులతో ఉత్సవాల నిర్వహణపై సోమ వారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జెండా ఉత్సవాన్ని ప్రశాంతంగా శాంతియుతంగా అన్నీ అనుమతులు తీసుకున్న తర్వాత జరుపుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముంద స్తుగా భారీ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో వందల సంఖ్యలో జెండాలు ఏర్పాటు చేస్తారని, సమిష్టిగా కలిసి చర్చించుకుని బాగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒకటో, రెండో పట్టణ ఎస్సైలు సుధాకర్, నరేష్, వివిధ ప్రాంతాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఇతరుల నుండి అనుకున్న సహాయాన్ని పొందలేక పోవచ్చును. దూరప్రయాణాలు వాయిదా పడటం, శుభకార్య ప్రయత్నాలకు ఆటంకాలుండటం జరుగుతుంది. చిన్న వ్యాపారులకు ఆదాయం ఫరవాలేదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువవలసి ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

భూ లావాదేవీలు ఫలించగలవు. సభలు సమావేశాలలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగులకు ప్రమోషన్లు, అధికార వర్గ సహకారం బాగుంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, విద్యార్థులకు మంచి ప్రగతి, జాతకులకు ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి పరంగా జీవనం కలవారికి ఆర్థికస్థితి కొంత బాగుంటుంది. అనుకున్న పనులు ఆటంకాలతో సాగుతాయి.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

రావలసిన బాకీలు నిలబడిపోతాయి. అనుకోని ప్రయాణాలు, శుభకార్య ప్రయత్నాలలో ఆలస్యం ఉంటుంది. వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసికొంటారు. ఉద్యోగార్థులకు మేలైన అవకాశాలుండకపోవచ్చును. కుటుంబసౌఖ్యము బంధు సఖ్యత బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు లభించగలవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు రావలసిన బాకీలు లభించడం, పని భారం ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు జరపకుండా జాగ్రత్తపడాలి. బిడ్డల విద్యా శుభకార్య విషయాలందు శ్రద్ధ చూపుతారు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పారిశ్రామికవేత్తలకు, కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. బంధుమిత్రులకు సహాయపడతారు. ప్రముఖులతో పరిచయాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. విద్యావృద్ధి కలదు. ఆదాయం పెరిగి వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. అయితే ఖర్చులు కూడా పెరుగుతాయి. పనులు ముందు వెనుకలుగా జరుగుతూ టెన్షన్ పెడతాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. పట్టుదలతో అనుకున్న పనులు సాధించుకొంటారు. అనుకోని పెద్ద ఖర్చు పైనబడగలదు. ప్రముఖులతో పరిచయాలు బలపడతాయి. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులు జరుపుతారు. చిన్న వ్యాపారులు, వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 23.9.2016 నుండి**
**తేది. 29.9.2016 వరకు**

ఈ వారము మిధున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, సింహంలో బుధ రాహువులు, కన్యలో రవి గురువులు, తులలో శుక్రుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో కుజుడు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 23 శుక్రవారము మధ్యాష్టమి. వ్యతీపాత మహాలయం.
తేది 30 శుక్రవారము మహాలయ అమావాస్య.

### భాద్రపద కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | సప్తమి | ఉ॥ గం.9.08వ॥ |
| తేది. 24 | శని | అష్టమి | ఉ॥ గం.7.05వ॥ |
| | పిదప | నవమి | రా॥ గం.5.17వ॥ |
| తేది. 25 | ఆది | దశమి | రా॥ గం.3.52వ॥ |
| తేది. 26 | సోమ | ఏకాదశి | రా॥ గం.2.57వ॥ |
| తేది. 27 | మంగళ | ద్వాదశి | రా॥ గం.2.25వ॥ |
| తేది. 28 | బుధ | త్రయోదశి | రా॥ గం.2.29వ॥ |
| తేది. 29 | గురు | చతుర్దశి | రా॥ గం.2.57వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూల సమయం. ఉద్యోగులకు విధి నిర్వహణ బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్య పనులు వాయిదా వేసికొంటారు. చేపట్టిన పనులు సరిగ్గా సాగక చికాకు కలిగిస్తాయి. కొత్త పరిచయాలు ఉన్నతికి తోడ్పడతాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

దైవకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు వాయిదా పడటం జరుగుతుంది. పరుష ప్రవర్తన, తొందరపాటు మాటలు తగ్గించుకొనాలి. విద్యా ప్రగతి బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. సమస్యాత్మక విషయాలలో సంప్రదింపులు, చర్చలు జరిగి పరిష్కారం కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు రావడం, ఆదాయం పెరగడం ఉంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

యజమానులు వర్కర్లతో జాగ్రత్తగా మెలగండి. శరీరానికి గాయాలు తగలవచ్చును. కొంతమంది మిమ్మల్ని పరోక్షంగా కించపరచవచ్చును. ఉదరకోశ రుగ్మతలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. వ్యాపారాలలో ఒడిదుడుకులను అధిగమించి, రాబడి పెరుగుతుంది. వృత్తి జీవనంలో సామాన్య అవకాశాలుంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపారవృద్ధికి కొత్త ప్రయత్నాలు జరుపుతారు. సమస్యలు సక్రమంగా సర్దుబాటు కాగలవు. పారిశ్రామిక వర్గాలకు ప్రోత్సాహం ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత కలదు. ఆస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. విద్యాప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆశించినంత ఎక్కువ ఆదాయముండదు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఓర్పు నేర్పుతో పనులు చక్కబెట్టుకొనవలసి వుండును. ఉద్యోగులు తమ విధి నిర్వహణ సమర్ధవంతంగా జరుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికంగా బాగుంటుంది. దైవకార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధిలో వేగం పుంజుకుంటాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులను జాగ్రత్తగా నెరవేర్చుకొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉమ్మడి వ్యాపారులకు లీజులకు అవకాశాలు దొరుకుతాయి. కళాక్రీడా సాంకేతిక రంగాల వారికి ఆదరణ ఉంటుంది. బంధువర్గాన్ని కలుసుకొంటారు. ప్రయాణాలుంటాయి. పైకి తీవ్రత లేకపోయినా ఆర్థికంగా ఇబ్బందులుంటాయి.

# పాక్‌పై దాడికి నెల్లూరు యాక్షన్‌టీమ్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీతో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, అరుణ్‌జైట్లీ, యం.వెంకయ్య నాయుడు, సుష్మాస్వరాజ్‌లు సమావేశమయ్యారు. అందరి ముఖాల్లోనూ తీవ్ర ఆవేదన, ఆగ్రహం కనపడుతోంది. మోడీ తీవ్రమైన స్వరంతో... ఒక చెంపను కొడితే రెండో చెంపను చూపెట్టు అన్న గాంధీజీ సిద్ధాంతాన్ని ఇక పక్కన పెడదాం, ఇప్పటి దాకా ఈ సిద్ధాంతాన్ని ఫాలో అయ్యే ఒక చెంప కాకుండా రెండు చెంపలూ కొట్టించుకుంటున్నాం. కన్నుకు కన్ను, కాలుకు కాలు, ఒకటికి వంద చావులు ఇక మన లెక్కగా ఉండాలి. ఇక ఆ పాకిస్థాన్‌ను నిద్రపోనీయకూడదు. ఇంతకాలం శాంతి, సహనం అంటూ కూర్చున్నాం. ఈ శాంతి మంత్రం వల్లే మన దేశ సైనికులను కోల్పోతున్నాం. రక్తానికి రక్తం ఇక మన సిద్ధాంతం కావాలి అని చెప్పాడు. వెంటనే మనోహర్ పారికర్... సార్, మీరు ఆర్డర్ ఇవ్వండి, అరగంటలో ఆ పాకిస్థాన్ అంతు తేలుస్తామన్నాడు. రాజ్‌నాథ్‌సింగ్ అందుకుని... నిన్న పఠాన్‌కోట్, నేడు యూరిబేస్ క్యాంప్... రేపు ఇంకొకటి... ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెడదాం. మనమీద వాళ్లు దాడి చేయడం కాదు, మనం దాడి చేస్తామేమోనని వాళ్లు అనుక్షణం భయపడుతుండాలి. ఇక ఎదురుదాడి తప్పదు అని అన్నాడు. అంతలో నరేంద్రమోడీ సెల్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నుండి అమెరికా అధ్యక్షుడు ఒబామా... యూరి ఆర్మీక్యాంప్ పై జరిగిన దాడికి సంతాపం వ్యక్తం చేస్తూ... ఉగ్రవాదంపై మీ పోరుకు మా పూర్తి సహకారం ఉంటుందన్నాడు. దానికి మోడీ... ఇంతకాలం ఉగ్రవాదాన్ని ఓ వైపు, పాకిస్థాన్‌ను ఇంకోవైపు చూస్తూ వచ్చాం. కాని రెండూ వేర్వేరు కాదు, ఒకటేనని తేలింది. కాబట్టి ఉగ్రవాదం మీద దాడి చేయడమంటే పాకిస్థాన్ మీద దాడి చేయడమే! ఇక మాకు తప్పదన్నాడు. అందుకు ఒబామా... పాకిస్థాన్ మీద దాడంటే ఇరు దేశాల మధ్య యుద్ధమే! ఇరు దేశాలు అణ్వాయుధాలను ప్రయోగించుకునే అవకాశముంది. అలాంటి పరిస్థితి రాకుండా ఇంకో మార్గమేదన్నా వుంటే చూడండి అని కోరాడు. మోడీ ఒబామాను లైన్‌లో వుంచి... ఒబామా గారు యుద్ధంతో పనిలేకుండా పాకిస్థాన్‌ను శిక్షించే మార్గం చూడమంటున్నారు. ఎలా చేద్దామని మిగతా వారిని అడిగాడు. ఆలోచించి సాయంత్రం చెబుతామని చెప్పు అని వెంకయ్య సూచించడంతో మోడీ అలాగే చేశాడు. తర్వాత అదే సబ్జెక్ట్ చర్చకు పెట్టాడు. అప్పుడు వెంకయ్య లేచి.. బాంబులు వేయకుండా, తుపాకులు పేల్చకుండా, తూటా బయటకు రాకుండా, యుద్ధ విమానాలు ఎగిరే పని లేకుండా శత్రువును దారుణంగా శిక్షించే ప్లాన్ నా దగ్గరుంది. దానిని అమలు చేద్దామన్నాడు. ఏంటది అని మోడీ అడిగాడు. ఇది చెప్పేది కాదు, వెంటనే మా యాక్షన్ టీమ్‌ను రంగంలోకి దించుతాను అని చెప్పి వెంటనే సెల్‌ఫోన్ తీసి కొందరికి ఫోన్ చేసి వెంటనే ఢిల్లీకి రావాలని చెప్పేసాడు. తర్వాత అందరూ లంచ్‌కు లేశారు.

★★★★★

సాయంత్రం మళ్లీ అందరూ ప్రధాని కార్యాలయంలో కూర్చున్నారు. వెంకయ్య పదేపదే వాచ్ చూసుకుంటూ... వీళ్లు ఇంకా రాలేదేంటబ్బా అని గుమ్మం వైపే చూడసాగాడు. మిగతావాళ్లు కూడా యాక్షన్‌టీమ్ కోసం టెన్షన్‌తో ఎదురు చూడసాగారు. ఓ అరగంట తర్వాత అక్కడకు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, మాజీమేయర్‌లు భానుశ్రీ, పులిమి శైలజ, మాజీఛైర్‌పర్సన్ అనూరాధ, ఇంకా పలువురు కార్పొరేటర్లు వచ్చారు. అందరి చేతుల్లోనూ పెద్ద సూట్‌కేసులున్నాయి. చివరగా కళ్లకు నల్లద్దాలు, నల్లచొక్కా, నల్లఫ్యాంట్, నల్ల బూట్లు వేసుకున్న స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకా(65+) లోపలకు వచ్చాడు. అతను రాగానే... ఏం హాలంతా చీకటిగా వుంది, ఢిల్లీలో కూడా కరెంట్ కోతలున్నాయా... మా చంద్రబాబే నయం, 24గంటలూ కరెంటిస్తున్నాడన్నాడు. వెంకయ్య ఓఎస్‌డి సత్యకు విషయం అర్థమై వెంటనే వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసాడు. అప్పుడే కంటి ఆపరేషన్ చేయించుకున్నాక కట్లు విప్పితే లోకం ఎంత వెలుతురుగా వుంటుందో, వివేకాకు కూడా ఆ హాల్ అంతే వెలుగుల్లో కనిపించింది. వారిని చూసాక మోడీ... యాక్షన్ టీం అంటే నేనేదో వూహించాను, వీళ్లేంటి ఇలా వున్నారు. పాకిస్థాన్ మీద దాడికి వీళ్లెలా ఉపయోగపడతారు అని ఆశ్చర్యంగా అడిగాడు. వెంకయ్య స్పందిస్తూ... పాకిస్థాన్ మీద దాడికి వెళ్లేది వాళ్లు కాదు... వాళ్ల చేతుల్లోని సూట్ కేసులలో వున్న టెర్రరిస్ట్‌లు అని చెప్పాడు. సూట్‌కేసుల్లో టెర్రరిస్టులా.. అదేంటి? అని మోడీ ప్రశ్నించాడు. వెంకయ్య దాని గురించి వివరిస్తూ... ఆ సూట్‌కేసుల్లో వుండేవాటిని ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలంటారు. వీటిలో జెట్65, ఏఎఫ్74, కెఎఫ్ 108 అని వివిధ రకాలున్నాయి. ఒక రకం కుడితే చికున్‌గున్యా, ఇంకో రకం కుడితే డెంగ్యూ, మరోరకం కుడితే క్యాన్సర్ జబ్బులు వస్తాయి. నెల్లూరు కార్పొరేషన్ బడ్జెట్ అంతా కూడా వీటిని పెంచడానికే ఉపయోగిస్తున్నారు. అలాగే నెల్లూరు ప్రజల సగం బడ్జెట్ వీటి మూలంగా వచ్చిన రోగాలను తగ్గించుకోవడానికే సరిపోతుంది. రాడార్‌లకు అందని యుద్ధవిమానాల ద్వారా ఈ దోమలను పాకిస్థాన్ అంతటా చల్లుతాం. అన్ని ప్రధాన నగరాలలోనూ వదులుతాం. పాకిస్థాన్‌లో ఎలాగూ మురికి కాలువలు, గుంటలు ఎక్కువ కాబట్టి వీటి వ్యాప్తికి ఇబ్బంది లేదు. ఈ దోమలు స్థానిక ప్రజల మీద దాడి చేస్తాయి. ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రులకు చేరుతారు. దేశం నిండా రోగులు తయారైతే ప్రభుత్వ ఆదాయం అంతా ఆసుపత్రుల అభివృద్ధికే సరిపోతుంది. అప్పుడు వాళ్లకు ఆయుధాలు సమకూర్చుకోవడం, ఉగ్రవాద శిబిరాలు నిర్వహించడం, అణ్వాయుధాలు పెంచుకోవడం వంటివాటిపై ఆసక్తి వుండదు. ప్రజలు రోగాల బారిన పడి వున్నప్పుడు వీళ్లు ఉగ్ర దాడులు చేయిస్తుంటే అక్కడి ప్రజలే వాళ్లను ఛీకొడుతారు. మేం రోగాలతో ఛస్తుంటే మీకు ఉగ్రవాద దాడులు ముఖ్యమా అని అంతర్గత తిరుగుబాటు రావచ్చు. యుద్ధం అంటే ఒక వారం లేదా ఒక నెల... మహా అంటే ఒక సంవత్సరం... కాని ఈ దోమలను వదిలితే ఇక భూమి వున్నంతకాలం పాకిస్థాన్ రోగాలతోనే ఛస్తుంది. మన జోలికి ఇకరాదు అని చెప్పి వెంకయ్య ముగించాడు. అది విన్నాక మోడీతో పాటు అందరూ చప్పట్లు కొట్టి... సూపర్ ప్లాన్ అంటూ అభినందించారు. అప్పుడే మోడీకి మళ్లీ ఒబామా ఫోన్ చేశాడు. ఒబామాకు ఈ ప్లాన్ అంతా వివరించాడు మోడీ... అది విన్న ఒబామా... అద్భుతమైన ప్లానింగ్... శత్రువును ఒక్కసారే కాకుండా ప్రతిరోజూ చంపే ప్లాన్ ఇది... పాకిస్థాన్ మీద ఈ యాక్షన్ ప్లాన్ సక్సెస్ అయితే తర్వాత ఇంకా కొన్ని దేశాలలోనూ ఈ ప్లాన్‌ను అమలు చేద్దామంటూ ఒబామా ఫోన్ పెట్టేశాడు.



## కావలి కబుర్లు

# అందరికీ సంక్షేమ ఫలాలు

**- రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు**



కావలి నియోజక వర్గంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు బీదా మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం బీదా మస్తాన్‌రావు అధ్యక్షతన కావలి టిడిపి కార్యాలయంలో నియోజక వర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్ కార్డులు, పెన్షన్లు జన్మభూమి కార్యక్రమాలలో ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన వారు నమోదుచేసుకోవాలన్నారు. గ్రామ కమిటీలు తప్పక నిర్వహించాలన్నారు. పట్టణంలోని 11వ వార్డులో పార్టీ అభ్యర్థి ఓడినా మైనంపాటి జగదీష్, యేసురత్నంల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడాన్ని అభినందించారు. టిడిపి కార్యకర్త పల్లా రవికుమార్ పార్టీ క్రియాశీల సభ్యత్వం పొంది మరణించటంతో ఆయన భార్య పద్మకు 2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో కావలిలో అక్టోబర్ 29న శ్రీ జగన్నాథ రథయాత్ర జరుగుతుందన్నారు. ఈ రథయాత్రను జయప్రదం చేయాలని అన్నారు. అనంతరం మద్దూరుపాడులో జరిగిన వనం-మనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కావలి మండలాధ్యక్షురాలు పర్రి మహేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలడుగు రంగారావు, తాళ్ళూరు మల్లిఖార్జున, సుధాకర్, షమీ, సుబ్బానాయుడు, శ్రీహరి, వాసు, నాయుడు రాంప్రసాద్, శ్రీదేవి, రవికుమార్ రెడ్డి, యేసురత్నం, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో జీవించాలి

**- ఎస్పీ విశాల్ గున్నీ**



జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని నెల్లూరు జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు శాఖ స్థలాల్ని పరిశీలించేందుకు వచ్చిన ఆయన వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ల ఆవరణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కావలి ప్రాంతంలో ఏమైనా సమస్యలుంటే తమ దృషికి తీసుకురావాలన్నారు. వెంటనే గుట్కా, మట్కా, సింగిల్ నెంబర్లు పోలీసుల కనుసైగల్లో జోరుగా సాగుతున్నాయనే ఆరోపనలు వెల్లువెత్తుతునాయని ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. ఆదారాలుంటే ఆయా పరిధిలోని ఎస్ఐ, సిఐ లపై చర్యలు తీసుకుటామన్నారు. కావలి బ్రిడ్జి సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా వుందని, దానిని నివారించేందుకు నెల్లూరు తరహాలో ట్రాఫిక్ క్రమబదీకరణకు తగిన చర్యలు చేపట్టాలని డిఎస్పీని ఆదేశించారు. నెల్లూరు సిసి కెమెరాల సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసందానంగా కావలి వన్ టౌన్ పోలీసు స్టేషన్ వెనుక సిసి కెమెరాలకు సంబందించిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ వెంట డిఎస్పీ రాఘవరావు, సిఐ లు వెంకట్రావు, ఎ వి రమణ, అశోకవర్ధన్, ఎస్ఐలు ఉన్నారు.

### ఏబీవీపీ ఆధ్వర్యంలో

# ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో కావలి నగరంలో స్థానికంగా ఉన్నటువంటి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో సోమవారం పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ చల్లా కౌషిక్ మాట్లాడుతూ... పాకిస్తాన్ ఉగ్రవాదులది ఒక పిరికిపంద చర్యగా వర్ణించారు. నిద్రపోత్తున్న జవాన్లపై దాడికి పాల్పడడం ఎంతో దారుణమైన చర్య అని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కె.బ్రహ్మానందం, నగర కార్యదర్శి నరసింహ, రామకృష్ణ బాబు, సుబ్బయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**1 నుంచి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి**

# శరన్నవరాత్రి ఉత్సవాలు



వచ్చే నెల 1 నుంచి 12వ తేది వరకు నెల్లూరులోని యర్రమిట్ట టెక్కేమిట్టలో వున్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి 16వ శరన్నవ రాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 11వ తేదిన విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామివార్ల శాంతి కళ్యాణం నిర్వహిస్తామని, 12వ తేదిన మహాలక్ష్మీదేవి అలంకారంతో అమ్మవారికి ఊరేగింపు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. 1వ తేదిన కలశస్థాపన, చండీ అలంకారం, గాజుల అలంకారంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రతి రోజూ ఒక విశిష్టమైన అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, ప్రతిరోజు రాత్రి భక్తులకు అన్నదానం వుంటుందని వారు పేర్కొన్నారు.



ఈ నెల 21వ తేదీ గూడూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో జరిగిన తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ మహిళా సదస్సులో ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.శైలజ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు.

# ఏసికి నివాళులు



మాజీమంత్రి స్వర్గీయ ఏ.సి సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీన నెల్లూరు, ఏసి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆనం కుటుంబసభ్యులు, అభిమానులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏ.సి.సుబ్బారెడ్డిని స్మరించుకున్న వారిలో తెలుగుదేశం నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, ఏసి సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులురెడ్డి, రంగయ్య నాయుడు, గాదంశెట్టి గోపి, షణ్ముగరావు, కోటమ్మ, శశిధర్, షమీమ్, సుధాకర్‌రెడ్డి, వెంకారెడ్డి తదితరులున్నారు.

# సుబ్బరామన్న జన్మదినోత్సవ వేడుకలు


(5వ పేజీ తరువాయి)

ప్రశంసించారు. ప్రముఖ సినీదర్శకుడు దర్శకరత్న దాసరి నారాయణరావు మాట్లాడుతూ, టిఎస్సార్ చాలామంది కళాకారులకు సన్మానాలు చేశారని, ఈ సన్మానం చరిత్రలో నిలుస్తుందని, మోహన్‌బాబు అనే వ్యక్తికి కాక, సామాన్యుడి స్థాయినుంచి ఇంతటి సమున్నతస్థాయికి వచ్చిన ఓ 40 ఏళ్ళ సుదీర్ఘ చరిత్రకు ఆయన సన్మానం చేస్తున్నారని అన్నారు. పూర్వకాలంలో రాజులు కళాకారులను సన్మానించేవారని, ఇప్పుడు టిఎస్సార్ చేయకపోతే కళాకారుల ప్రతిభ ప్రజలకెలా తెలుస్తుందని అందరి హర్షధ్వానాల మధ్య అన్నారు. దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ, సుబ్బరామిరెడ్డిగారు ఏటా తన పుట్టినరోజున కళాకారులను సన్మానించడం గొప్ప విషయమన్నారు. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, మోహన్‌బాబు తనకు అత్యంత ఆప్తుడని, ఈ సన్మానం మోహన్‌బాబుకు కాక, ఒక క్రమశిక్షణకు, కష్టానికి, అనుకున్నది సాధించగలననే పట్టుదలకు జరుగుతున్న ఘన సత్కారమని కొనియాడారు. మోహన్‌బాబు ఎందరికో ఒక స్ఫూర్తి ప్రదాత అని ప్రశంసించారు. సినీ నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ, 'మా కుటుంబానికి అత్యంత ఆప్తులు శ్రీ సుబ్బరామిరెడ్డిగారని, ఆయన పుట్టిన రోజున మోహన్‌బాబుకు ఘనసత్కారం జరగడం ఎంతో హర్షదాయకమని అన్నారు.

## ఉన్నత శిఖరాలకు..క్రమశిక్షణే సోపానం

**- డా. మోహన్‌బాబు**

తనకు జరిగిన ఘన సత్కారానికి డా. మోహన్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకింత స్థాయి వచ్చేందుకు క్రమశిక్షణకారణమన్నారు. తన జీవితం ఒక సుదీర్ఘప్రయాణమని, జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత, గురువైన దాసరి నారాయణ రావుగారు 1975లో 'స్వర్గం-నరకం' చిత్రంలో నటుడిగా తనకు జన్మనిచ్చారని, ఆ తర్వాత దాదాపు 5 వందలకు పైగానే సినిమాల్లో నటించానని, 60 సినిమాలు నిర్మించానని, ఇవి కాక విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా ఎంతోమందికి విద్యను అందిస్తున్నానని.. ఇవన్నీ సాధించానంటే తల్లిదండ్రుల తర్వాత నా గురువు ప్రసాదించిన క్రమశిక్షణే కారణమని ఆయన ఎంతో ఉద్వేగంతో అన్నారు. పూర్వకాలంలో జమీందారులు, రాజులు మాత్రమే కళాకారులకు సన్మానం చేసేవారని, ఈ కాలంలో అలాంటి వ్యక్తే సుబ్బరామిరెడ్డిగారని అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు. ఈ నలభైఏళ్ళలో ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి మహోన్నత వ్యక్తులతో పాటు, ఉత్తరాదికి చెందిన ఎంతోమంది నటీనటుల్ని సన్మానించారని, ఆయన తప్ప కళాకారుల్ని ఇంత ఘనంగా సన్మానించేవారు ఎవరూ లేరని మోహన్‌బాబు కొనియాడారు. ఈ సందర్భంగా తనను అభిమానించి వచ్చిన సినీప్రముఖులకు, రాజకీయప్రముఖులకు, ప్రత్యేకించి తనను సన్మానించిన సుబ్బరామిరెడ్డికి డా.మోహన్‌బాబు తన కృతజ్ఞతలు తెలియజేశారు. రెండురోజుల పాటు ఎంతో ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో సినీప్రముఖులు చిరంజీవితో పాటు బోనీకపూర్, అల్లు అరవింద్, నాగబాబు, వెంకటేశ్, బ్రహ్మానందం, రాణా, మంచు విష్ణు, మంచు మనోజ్, సునీల్, రాజ్‌తరుణ్, నిఖిల్, సాయి ధరమ్‌తేజ, అల్లు శిరీష్, ఆలీ, డి.సురేశ్‌బాబు, రవిరాజా పినిశెట్టి, ప్రముఖ దర్శకుడు బి.గోపాల్, పరుచూరి గోపాల కృష్ణ, పోసాని, రఘుబాబు, నటీమణులు శ్రీదేవి, జయసుధ, జయప్రద, మంచు లక్ష్మి, ప్రగ్యాజైశ్వాల్, ఛార్మి, తదితరులెందరో పాల్గొన్నారు. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామిగౌడ్, రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, నాయకులు ద్రోణంరాజు శ్రీనివాసరావు, వరప్రసాద్‌రెడ్డి తదితర ప్రముఖులెందరో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు సినీ గీతాల సిడిలను చిరంజీవి ఆవిష్కరించగా, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మోహన్‌బాబును ఆత్మీయంగా సన్మానించారు. సుబ్బరామిరెడ్డి తల్లిదండ్రుల చిత్రాలను, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటాన్ని బోనీకపూర్-శ్రీదేవి దంపతులు ఆవిష్కరించారు. మోహన్‌బాబు నటప్రస్థానం పుస్తకాన్ని ప్రఖ్యాత నటీమణులు శ్రీదేవి, జయసుధ, జయప్రద ఆవిష్కరించగా, ప్రఖ్యాత గాయకుడు ఏసుదాసు ఈ కార్యక్రమానికి విచ్చేసి డా.మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మోహన్‌బాబు విద్యాసంస్థ శ్రీవిద్యా నికేతన్ నుంచి విచ్చేసిన చిన్నారులు చేసిన 'శివతాండవ' నృత్యం, 'మన్మథవధ' నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. ఈ నృత్యాలను అందరూ బాగా మెచ్చుకున్నారు. కాగా, ఈ వేడుకల ముందురోజు వరకు విశాఖలో కుండపోత వర్షం కురిసినప్పటికీ ఈ రెండు రోజులూ వర్షం రాకుండా వాతావరణం ఎంతో ఆహ్లాదంగా వుండడం టిఎస్సార్ శివభక్తి తత్పరతకు నిదర్శనమని వేరే చెప్పనక్కర లేదు.



ఏదేమైనా, టిఎస్సార్ జన్మదినోత్సవ వేడుకలు ఈసారి మరింతగా అందరి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాయి. పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, ప్రముఖులతో విశాఖతీరం కళకళలాడింది. అటు కళాకారులను, ఇటు ఆధ్మాత్మిక వేత్తలను, రాజకీయప్రముఖులను, సినీదిగ్గజాలను, విశాఖ ప్రజలందరినీ టిఎస్సార్ జన్మదినోత్సవ వేడుకలు ఎంతగానో అలరింపజేశాయి. ప్రతిఒక్కరి మనసులనూ పులకరింపజేశాయి. సింహపురీయుడు.. అందరివాడు.. కళామతల్లి ముద్దుబిడ్డ.. మన సుబ్బరామన్న ఇలాగే మరెన్నో పుట్టినరోజు వేడుకలను ఆనందంగా-ఆత్మీయంగా జరుపుకోవాలని, తద్వారా కళామతల్లికి, ఆధ్యాత్మికరంగానికి మరింతగా సేవచేయాలని, విశిష్టమైన తన సేవలద్వారా అపూర్వమైన ఖ్యాతిని పొంది.. దేశవిఖ్యాతిని జగద్విదితం చేయాలని మనసారా కోరుకుంటోంది..'లాయర్'!...

**హ్యాట్సాఫ్!**

- 126 నవలలు రాసి విఖ్యాతిగన్న నవలాసూర్యుడు.. సూర్యదేవర రామ్మోహన్‌రావు
- 'మ్యాన్ ఆఫ్ రికార్డ్స్'..గా ప్రపంచస్థాయి గుర్తింపు




# అక్షరంతో.. అంతర్జాతీయ ఖ్యాతి

***అక్షరాన్ని గువ్వలా కువకువలాడించగలమా?..రవ్వలా మెరుపులు మెరిపించగలమా?.. అక్షరాన్ని వినీల విహాయసంలో విహంగంలా ఎగిరించగలమా?.. మహార్ణవంలో పడిలేచే తరంగంలా ఓలలాడించ గలమా?..అక్షరానికి దారం కట్టి ఎగరేస్తే అది ఏ అంతరిక్షానికో ఎగిరిపోతుందా?..ఏ వినువీధుల్లోనో మెరిసే నక్షత్రమై నిలుస్తుందా?.. నిజానికి అంతటి శక్తి అక్షరానికి వుందా?..ఇలాంటి ధర్మసందేహాలన్నిటికీ ఒకే ఒక్క సమాధానం..సూర్యదేవర రామ్మోహన్‌రావు.***

అక్షరమంటే అక్షయమైనదని..అక్షరానికున్న శక్తి అనంతమైనదని, ఓంకారంతో జనించిన ఆ మహాశక్తి అజేయమైనదని.. అక్షరాలా నిరూపించిన అక్షరయోధుడు..మన నవ..యువ నవలాకారుడు.. సూర్యదేవర రామ్మోహన్‌రావు. ఒక వ్యక్తి..అక్షరయజ్ఞం చేసి..అక్షరశక్తిగా మారడం చూడాలంటే..ఆ శక్తి విశ్వకీర్తులనార్జించిన వైనాన్ని చూసి తరించాలంటే..అందుకు నేటికీ ప్రత్యక్షర సాక్షి.. ఒకే ఒక్కడు. ఆయనే... మన సూర్యదేవర రామ్మోహన్‌రావు. తెలుగు అక్షరానికి కొత్త వెలుగులు దిద్ది..విశ్వవిఖ్యాత కీర్తి తెచ్చిపెట్టిన నవలా సూర్యుడాయన. ఇప్పటిదాకా ఒకటి కాదు, రెండు కాదు...అక్షరాలా నూట ఇరవై ఆరు నవలలు రాసి రికార్డ్ సాధించారంటే అతిశయోక్తి కాదు. ఏ ఒక్క రచయితా చేయలేని అద్భుతాన్ని అలవోకగా చేసి చూపించిన విశిష్ట సాహితీస్రష్ట ఆయన. ఆ.. రాసిన ప్రతి నవలా అశేష పాఠకులనుర్రూతలూగించి విశేష ప్రఖ్యాతి సాధించినదే కావడం మరో గొప్పదనం. అది ఒక్క నవలారంగానికే కాదు..తెలుగు సాహితీరంగానికే సమున్నతమైన గౌరవం..ఇది తెలుగుజాతికంతటికీ ఎంతో గర్వకారణం.

నవలారంగంలో రారాజుగా మెరిసిన ఆ అక్షరశిల్పి 126 నవలలు రచించడం ఒక రికార్డయితే, అందులో 72 నవలలు పత్రికల్లో సీరియల్స్‌గా రావడం, పూర్తిస్థాయి నవలలుగా ముద్రితం కావడం మరో రికార్డ్. 1985లో తొలి నవల 'మోడల్' ఆయనకెంతో పేరు తెచ్చింది. ఆ తర్వాత ఎన్నో నవలలు రచించి మరింత ప్రఖ్యాతి చెందారు. ఒక్క తెలుగులోనే కాక, తమిళం, కన్నడం, ఆంగ్ల భాషల్లోనూ ఆరితేరిన యోధుడు సూర్యదేవర. నాలుగు భాషల్లో పట్టు సాధించి ఆయన రచించిన నవలలు ఆయా భాషల్లో ఆణిముత్యాలవంటివేనని వేరే చెప్పనక్కర లేదు. ఆయన రచించిన 72 నవలలు కన్నడ దినపత్రికలు, ఇతరత్రా పత్రికల్లో సీరియల్స్‌గా వస్తే, ఆంగ్లంలో రచించిన రెండు నవలలు డెన్వర్, కొలరాడో స్టేట్..యుఎస్‌ఏ వారు వాటిని ముద్రించడం మరో రికార్డ్. అంతటి ఘనమైన కీర్తి ఒకే ఒక్క తెలుగు నవలాకారుడు..మన సూర్యదేవరకే దక్కడం మనందరికీ గర్వకారణం. తెలుగులో అత్యధిక నవలలు రచించిన నవలాకారుడు కూడా ఆయనే. అలా అత్యధిక నవలలు రచించి 32 ప్రపంచస్థాయి అవార్డులను కూడా ఆయన సాధించగలగడం నవలా చరిత్రలోనే ఎంతో అపూర్వమైన.. అపురూపమైన విషయం. తెలుగు పత్రికా రంగంలో సంచలనాత్మకంగా వెలువడుతున్న 'స్వాతి' సపరివార పత్రికలో ఆ పత్రిక పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక సీరియల్స్ వ్రాసిన ఏకైక వ్యక్తిగా ఘనత చెందిన రచయిత సూర్యదేవర. ఆయన అన్ని నవలలు దేనికదే ప్రత్యేకం అన్నట్లుగా ఆ రచనా శైలి వుంటుంది. నాగలోకయాగం, గంధర్వయజ్ఞం, మనోయజ్ఞం, అక్షరయజ్ఞం, అనితర సాధ్యుడు, సస్పెన్స్ ఇన్ లవ్, ఎవరు ఎవరినైనా ఎలాగైనా ప్రేమించవచ్చు, ప్రేమకు నో రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, మాయ, ఆగ్నేయాస్త్రం, అంతుబట్టని ప్రేమకథ, సంకల్పం, మయసభ, ఆరోరుద్రుడు, మృత్యుంజయుడు, లక్ష్యం..ఇలా ఎన్నో నవలలు సూర్యదేవర రామ్మోహన్‌రావు విలక్షణ రచనా శైలికి..విశిష్టమైన భావనా శక్తికి ప్రతీకలు. ఆంగ్లంలో ఆయన రచించిన 'ది ఎనిమీ ఆఫ్ మ్యాన్‌కైండ్', 'ది డిక్టేటర్ ఆఫ్ ది డార్క్' అనే నవలలకూ అంతర్జాతీయస్థాయిలో ఎంతో ప్రఖ్యాతివచ్చింది. హిందీలోనూ ఆయన అద్వితీయమైన భాషా పరిణతి సాధించారు. తెలుగు, కన్నడ, హిందీ చిత్రాలకు కూడా ఆయన అద్భుతమైన తన అక్షరాస్త్రాలను అందించి ఆ చిత్రాలకు ఒక ప్రత్యేకఖ్యాతిని సంతరించారు. నటనారంగంలోనూ రాణిస్తూ 'రంగుల కల' చిత్రంలో తనదైన నటనావైదుష్యాన్ని ప్రదర్శించారు. ఆయన రచించిన నవలలను ఒక విశిష్టమైన పరిశోధనాంశంగా తీసుకుని ఉస్మానియా యూనివర్శిటీ రీడర్ ఒకరు, మారిషస్‌లోని విద్యార్థి ఒకరూ థీసిస్‌లుగా వెలుగులోకి తెచ్చేందుకు పరిశోధనలు చేస్తున్నారు.

## మున్నలూరు ముద్దుబిడ్డ



| | | |
|---|---|---|
| పేరు | : | సూర్యదేవర రామ్మోహన్‌రావు |
| ఊరు | : | మున్నలూరు (కంచికచెర్ల మండలం, కృష్ణాజిల్లా) |
| కన్నవారు | : | వెంకటనరసమ్మ-అనంతయ్య |
| పుట్టినతేది | : | 24.8.1958 |
| చదువు | : | బికాం (విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల)<br>ఎంకాం (ఆంధ్రా యూనివర్శిటీ)<br>పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జర్నలిజం (భారతీయ విద్యాభవన్) |
| తొలి నవల | : | మోడల్ |
| తెలుగు నవలలు | : | 126 |
| సతీమణి | : | పద్మజారాణి |
| తనయులు | : | సూర్యదేవర కాళీఅనంత్ (సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, మిచిగాన్)<br>సూర్యదేవర తేజస్విఅనంత్ (సాఫ్ట్‌వేర్ అనలిస్ట్, నార్త్ కెరోలినా) |
| ప్రస్తుత నివాసం | : | హైదరాబాద్ |

## ఎన్నెన్నో పురస్కారాలు.. అంతర్జాతీయస్థాయి అవార్డులు :

సూర్యదేవర రామ్మోహన్‌రావు నిరంతర అక్షరకృషీవలుడు. ఆయన చేతిలో అక్షరం..ఒక చైతన్య కిరణం..ప్రతి అక్షరం పాఠకుల మనసులను మైమరపించే సమ్మోహనాస్త్రం. విలక్షణమైన రచనా విన్యాసం ఆయన సొంతం. తనదైన రచనాశైలితో ఆయన రాసే ప్రతి అక్షరం..పాఠకుల హృదయాల్లో ఇట్టే నిలిచిపోతుంది. ఒక్క తెలుగురాష్ట్రాల్లోనే కాదు, ప్రపంచమంతటా ఆయనకు అభిమానులున్నారు. నేటికీ నిత్యం ఆయన అక్షరయజ్ఞంలోనే జీవితాన్ని కొనసాగిస్తున్నారు. సూర్యదేవర రచనా ప్రతిభకు ఎన్నో ఘనమైన అవార్డులు వచ్చాయి. పలు భాషల్లో అత్యధిక నవలలు రచించినందుకు 2014లో అంతర్జాతీయస్థాయిలో 'మ్యాన్ ఆఫ్ రికార్డ్స్'గా ప్రపంచస్థాయి అవార్డును అందుకున్నారు. ఇంకా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సంస్థలు ఆయనకు ప్రతిష్టాత్మకమైన అవార్డులెన్నో బహుకరించాయి. ప్రతిభావంతులకు 'లాయర్' పత్రిక తరపున ప్రదానం చేసే విశిష్టమైన తుంగా పండుగ సందర్భంగా ఆయనకు 'లాయర్' అవార్డు కూడా లభించింది. ఏదేమైనా, అక్షరంతో అంతర్జాతీయస్థాయి ఖ్యాతి పొందిన ఆ అక్షర యోధునికి.. నవలారచనలో సాటి లేని మేటిగా వుంటూ తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్న ఆ తెలుగు భాషామతల్లి ముద్దుబిడ్డకు.. అద్వితీయమైన తెలుగు భాషా వైదుష్యంతో నవలాకేతనాన్ని రెపరెపలాడిస్తున్న ఆ అక్షర వీరునికి హ్యాట్సాఫ్!.



**2001, నవంబర్‌లో తుంగా అవార్డును స్వీకరిస్తున్న సూర్యదేవర రామ్మోహన్**

# రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు ఎర్రజెండా!

(మొదటి పేజీ తరువాయి)

రాజధానిని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మలచుకున్న ప్రభుత్వ పెద్దలు... దీనిని స్విస్‌ఛాలెంజ్ ముసుగులో సింగపూర్ కన్సార్టియంకు అప్పగించాలనుకోవడం తెలిసిందే! ఇందులో భూమి రైతులది, పెట్టుబడి ప్రభుత్వానిదైతే ఎక్కువ ఆదాయం పొందేది మాత్రం సింగపూర్ కంపెనీ! ఆ కంపెనీతో ఏం ఒప్పందాలున్నాయి, ప్రభుత్వానికి ఆదాయమెంత అన్న వివరాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రయోజనం లేని రీతిలో రాజధాని బాధ్యతలను సింగపూర్ కంపెనీలకు ఎందుకు అప్పగించాలనుకుంటున్నారు. దాని వెనుక ఎవరెవరి ప్రయోజనాలు ఎంతెంత ఉన్నాయన్న విషయం ప్రభుత్వ పెద్దలకే తెలియాలి. ఎన్నో స్వదేశీ కంపెనీలు రాజధాని నిర్మాణ పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, చంద్రబాబు వాటిని రానీయకూడదన్న ఉద్దేశ్యంతోనే అడ్డగోలు నిబంధనలు పెట్టి స్విస్‌ఛాలెంజ్ అని ఒకటి పెట్టి సింగపూర్ కన్సార్టియంకు రాజధాని పని అప్పజెప్పాడు. స్విస్ ఛాలెంజ్‌పై కొన్ని స్వదేశీ కంపెనీలు హైకోర్టులో పిటిషన్ వేయడం, హైకోర్టు దీనిపై స్టే మంజూరు చేయడం తెలిసిందే!

ఇక ముంపుకు అవకాశమున్న 10వేల ఎకరాలలో పరిపాలనా భవనాలు కట్టడం పై కూడా గ్రీన్ ట్రిబ్యూనల్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కృష్ణా ప్రవాహానికంటే 10 అడుగుల దిగువన ఈ 10వేల ఎకరాలున్నాయి. ఈ ప్రాంతంలో కృష్ణానదితో పాటు సమీపాన వున్న వాగులు పొంగితే ఈ 10వేల ఎకరాలు ముంపుకు గురవుతాయి. భవిష్యత్‌లో ఎప్పుడైనా ఇది ప్రమాదమే! ఇప్పుడు 10వేల ఎకరాల భూమిని కనీసం పాతిక మీటర్లు ఎత్తు పెంచాలి. ఇలా చేయాలంటే వేలకోట్లతో కూడుకున్న పని. ప్రకృతి పరంగా కూడా అమరావతి రాజధానికి అన్నీ అడ్డంకులే! మహానుభావుడు శివరామకృష్ణన్ నెత్తి నోరూ బాదుకుని చెప్పాడు అమరావతి ప్రాం తంలో రాజధాని వద్దని! వ్యవసాయ భూములను పాడు చేసి రాజధాని కట్టొద్దంటూ ఎంతోమంది మేధావులు సూచించారు. చంద్రబాబు వాటన్నింటిని పెడచెవిన పెట్టాడు.

రాజధాని పరంగా ఇప్పటివరకు వెలగపూడి సచివాలయ భవనాలు కూడా పూర్తి కాలేదు. అవి కూడా తాత్కాలిక భవనాలే! గట్టిగా అంటే ఇంకో సంవత్సరం రాజధాని పనులు జరుగుతాయి. ఎలక్షన్ ట్రెండ్ ప్రారంభమైతే రాజదాని మీద శ్రద్ధ తగ్గిపోతుంది. వచ్చే ఎన్నికలలోపు అమరావతి రాజధానిలో పెద్ద మార్పులేమీ వుండవు. మళ్ళీ తెలుగుదేశమే వస్తే అమరావతి రాజధానితోనే తంటాలు పడతారు. అదే ప్రభుత్వం మారితే.... రాజధాని మారదన్న గ్యారంటీ ఏమీ లేదు.

# బీజేపీ.. డబుల్ గేమ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే బీజేపీ మరికొన్ని ప్రాంతీయ పార్టీలతో బ్యాలెన్స్‌గా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే తెలుగుదేశం తమ మిత్రపక్షమే అయినప్పటికీ ఇక్కడ ప్రతిపక్షమైన వైసిపిని మాత్రం శత్రుపక్షంగా చూడడం లేదు. బీజేపీలో ఓ వర్గం నాయకులు తెలుగుదేశంను లైన్‌లో పెట్టుంటే, మరో వర్గం నాయకులు మాత్రం వైకాపాను లైన్‌లో ఉంచారు. అక్రమాస్తుల కేసుల సంగతి పక్కనపెడితే మోడీ మనసులో చంద్రబాబు కంటే జగన్‌కే ప్రాధాన్యత వుంది. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఎదిరించిన కాంగ్రెస్ సీనియర్ నేతలెందరో మళ్ళీ ఆమె కాళ్ల మీద పడ్డారు. కాని జగన్ నాలుగు పదుల వయసులోనే సోనియాను ఎదిరించాడు. ఆమె పెట్టించిన అక్రమకేసులను ఎదుర్కొన్నాడు. 16నెలలు జైలు జీవితం గడిపాడు. ఇదే జగన్ ఆమెతో రాజీపడిపోయి వుంటే ఈరోజు అతని మీద ఒక్క కేసు వుండేది కాదు.

చంద్రబాబుది నిలకడ లేని వైఖరి అని మోడీకి అనుభవపూర్వకంగా తెలుసు. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో తనను ముఖ్యమంత్రి కుర్చీ నుండి దించాలని చంద్రబాబు చేసిన డిమాండ్‌ను మోడీ అప్పుడే మరచిపోగలడా? అదీగాక వచ్చే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలన్నీ తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేయొచ్చు. ప్రధాని పీఠంపై మోజుతో చంద్రబాబే ఇక్కడ రింగ్ లీడర్ కావచ్చు. బీజేపీని గతంలో లాగే మతతత్వ పార్టీ అని విమర్శించి తెగదెంపులు చేసుకోవచ్చు. అదీగాక ఇప్పుడున్న రాష్ట్ర రాజకీయ పరిస్థితులను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీది విజయమని ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అందుకే బీజేపీ వాళ్లు రేపటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అటు టీడీపీతో పాటు ఇటు వైసీపీతోనూ సరసాలు కొనసాగిస్తున్నారు.

## సరిహద్దుల్లో...



# యుద్ధ మేఘాలు

***యుద్ధానికి మేము సిద్ధమే... అయితే అన్ని కోణాల్లో పాకిస్థాన్‌ను దెబ్బ తీయాలి. ప్రపంచ న్యాయస్థానంలో పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టాలి. ప్రపంచంలో దానిని ఏకాకిని చేయాలి. దౌత్యపరమైన విజయం సాధించాలి. అలాగని మీరు చేతులు కట్టుకుని కూర్చోవద్దు. అవతలివాడు ఒక తూటా పేలిస్తే, వంద తూటాలతో సమాధానం చెప్పండంటూ సైన్యానికి సంకేతాలిచ్చింది భారత ప్రభుత్వం!***



**ఒక్క ఛాన్స్... ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వండి చాలు... ప్రపంచపటంలో పాకిస్థాన్‌ను లేకుండా తుడిచి పెట్టేస్తామంటుంది భారత సైన్యం... రోజూ చచ్చేకంటే ఒకేసారి తెగబడదాం... పాకిస్థాన్‌ను తుదముట్టిద్దాం... అంటూ ఉడికిపోతున్నారు భారత ప్రజానీకం.**

యూరి సైనిక శిబిరంపై ఉగ్రవాదుల దాడి, 18మంది సైనికుల మరణం ప్రతి భారతీయుడిని కలచివేసింది. పాకిస్థాన్‌పై యుద్ధానికి దిగాల్సిందేనన్నంత కసి వచ్చేసింది. భారత ప్రభుత్వం పచ్చజెండా వూపుంటే ఈ వరకు భారత సేనలు కదనరంగంలో కరాళనృత్యం చేస్తుండేవి. అయితే ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు కావాలంటూ ప్రపంచ దేశాలను ఏకం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ముందుగా పాకిస్థాన్‌పై దౌత్యపరమైన విజయం సాధించారు. యూరి దాడి తర్వాత ఒక్క చైనా తప్ప మిగతా ప్రధాన దేశాలన్నీ కూడా పాకిస్థాన్ వైపు ఛీత్కారంగా చూస్తున్నాయి. పాక్‌ను అమెరికా ఘాటుగానే హెచ్చరించింది. పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలంటూ ఆ దేశ సెనేట్‌లో ఇద్దరు సభ్యులు ప్రైవేట్ బిల్లు కూడా ప్రవేశపెట్టడం వారి స్పందనకు అద్దం పడుతోంది. ఇక భారత చిరకాల మిత్ర దేశం రష్యా అయితే పాక్‌తో సంయుక్త సైనిక విన్యాసాలను రద్దు చేసుకుంది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి దేశాలతో పాటు ఆసియా దేశాలన్నీ కూడా భారత్‌కు సంఘీభావం ప్రకటించాయి. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లు సైతం పాక్ చర్యలను ఖండించాయి. ఇటీవల కాలంలో ప్రధానిగా నరేంద్ర మోడీ చేసిన విదేశీ పర్యటనలు, ఆయా దేశాధినేతలతో సంప్రదింపుల ఫలితంగానే మన దేశానికి ఇతర దేశాల నుండి ఇంత మద్దతు కూడగట్టగలిగారు. దౌత్యపరంగా విజయం సాధించాం. యూరి లాంటి సంఘటనలు ఇకముందు చోటు చేసుకుంటే యుద్ధం అనివార్యమే! చైనా అండ చూసుకుని పాకిస్థాన్ విర్రవీగుతుంది. భారత్ తమపై దాడికి దిగితే చైనా ఆదుకుంటుందని ఆ దేశం భావిస్తోంది. చైనా భారత్ వ్యతిరేక ధోరణితో వుందన్నది వాస్తవమే! జైష్ ఇ అహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్‌పై నిషేధాన్ని అడ్డుకున్నది కూడా చైనానే! అయితే పాకిస్థాన్‌కు అండగా నిలవడం వల్ల చైనాకొచ్చే ప్రయోజనమేమీ లేదు. పాకిస్థాన్‌కు ఆ దేశం అండగా నిలవడం అంటూ జరిగితే భారత్‌తో పాటూ ప్రధాన దేశాలన్నీ కూడా చైనాపై ఆంక్షలు విధించే అవకాశాలున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా దూసుకుపోతున్న చైనా మార్కెట్ అప్పుడు కుదేలవుతుంది. భారత్ వంటి పెద్ద మార్కెట్ వ్యవస్థల మీదే చైనా ఆధారపడి వుంది. కాబట్టి వాళ్ల గొయ్యి వాళ్లు తీసుకోరు.

ప్రస్తుతానికైతే సరిహద్దుల్లో యుద్ధవాతావరణమే వుంది. ఏ క్షణాన ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో అంతు చిక్కని పరిస్థితి. ఇంకోసారి పాక్ వైపు నుండి ఇలాంటి దురాగతాలు జరిగితే మాత్రం ఇక ఉపేక్షించే అవకాశముండదు.




# తుని తుట్టెను కలబెట్టారు!


## ☞ రంగంలోకి సిఐడి... వైకాపాపై దాడి!



కాపు రిజర్వేషన్ల పోరాటంలో భాగంగా తునిలో జరిగిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు మంటలు ఆగిపోయి, రైలు పెట్టెలు కాలి బూడిదైనా, దాని నుండి పుట్టిన రాజకీయ సెగలు మాత్రం ఇంకా రగులుతూనే వున్నాయి. తుని దుర్ఘటనను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మెడకు చుట్టేందుకు చంద్రబాబు సర్కార్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే తుని సంఘటనలో వైసిపి నాయకులు, మాజీఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పాత్రపై సిఐడి విచారణ జరుపుతోంది. ఇప్పటికే రెండు దఫాలుగా ఆయనను విచారించారు. రైలు దగ్ధం ఘటనలో ఆయన పాత్రపై సిఐడికి ఎలాంటి సాక్ష్యాలు దొరికాయో ఇంకా బయటకు రాలేదు. అయితే కాపుల రిజర్వేషన్ ఉద్యమానికి వైకాపాకు లింకు పెట్టి, కేసులు పెట్టిస్తున్న చంద్రబాబు పరోక్షంగా వైకాపాకే రాజకీయ ప్రయోజనం కలిగిస్తున్నాడు. తుని ఘటనలో కాపుల పాత్రేమీ లేదని, వారంతా అమాయకులేనని, అసలు దోషులు వైకాపా నాయకులేనని కేసులు పెట్టి నిరూపించడం ద్వారా కాపు ఓటు బ్యాంకును కాపాడుకోవాలన్నది చంద్రబాబు ప్రయత్నం. ఇదే జరిగితే సీన్ రివర్సవుతుంది. తమ కోసం రైళ్లను తగలబెట్టేంత స్థాయిలో విజృంభించిన వైకాపా వైపు కాపులు నిలుస్తారుగాని, చంద్రబాబు వైపు ఎందుకు నిలుస్తారు?

తుని రైలు పెట్టె ద్వారా కాపు ఓట్ల తుట్టెను కలబెట్టాడు చంద్రబాబు. కాపు రిజర్వేషన్ల ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం వైకాపాకు అనుకూలంగా ఉన్నాడని ఆయన అనుమానం. అందుకే తన పార్టీలో వున్న కాపు నాయకుల చేత ముద్రగడను అదేపనిగా తిట్టిస్తున్నాడు. ఈరోజు కాపులు నిమ్మకాయల చినరాజప్పనో, నెల్లూరు మంత్రి నారాయణనో తమ నాయకులుగా భావించడం లేదు. తమ రిజర్వేషన్ల కోసం రోడ్డెక్కిన ముద్రగడనే నాయకుడిగా భావిస్తున్నారు. 'తుని' సంఘటనలో ప్రభుత్వ చర్యలన్నీ కూడా ముద్రగడను, వైకాపా నేతలను ఒక వేదిక మీదకు తెచ్చేవిలాగానే ఉంటున్నాయి. ఇదే జరిగితే నష్టపోయేది తెలుగుదేశమే!

## అశ్రునివాళి



మాకు ప్రేమానురాగాలు పంచిన ప్రేమమూర్తి

**నక్కల రమణయ్య గారు**

తే.9.9.2016ది స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : **నక్కల రమణమ్మ**

కుమార్తె - అల్లుడు
**బీద మంజుల - బీద మస్తాన్‌రావు**
చైర్మెన్, బిఎమ్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్

మనుమడు - **బీద మనోజ్**
మనుమరాలు - మనుమరాలి భర్త
**కె.మాధురి - కె.మహితేజ్**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com